ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 66, పేజీలు - 08

బుధవారం, సెప్టెంబర్ 2, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ఓవర్ టు ఢిల్లీ

## - ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ పంచాయతీ

- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత
- సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ
- ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. అయితే ఈ పర్యటన రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. గత కొన్ని రోజులుగా హాట్ టాపిక్‌గా మారిన మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకుని పలువురు కేంద్ర మంత్రులతో రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులపై చర్చలు జరిపారు. మంత్రి కొండా సురేఖ సైతం ఆగమేఘాల మీద ఢిల్లీకి వెళ్లడంతో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. కేసీ వేణుగోపాల్ సహా ఢిల్లీ పెద్దలను కలిసి వివరణ ఇచ్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.
ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బుధవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో సమావేశం కానున్నారు. ఈ భేటీలో మంత్రి కొండా సురేఖ వ్యవహారంతో పాటు తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిల వైఖరిపై 2లో..



# ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు వద్దు

## - ఎస్‌సిఓ సదస్సులో పాక్ ప్రధానికి మోదీ చురకలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఉగ్రవాదంపై పోరాటంలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని, ఆర్థిక సహకారం, రిక్రూట్‌మెంట్, రాడికలైజేషన్, సురక్షిత స్థావరాలు సహా దాని మొత్తం వ్యవస్థను సమూలంగా తుడిచిపెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం పిలుపునిచ్చారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్‌కేక్ వేదికగా జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ 'మానవాళి మొత్తానికి ఉగ్రవాదం తీవ్రమైన సవాల్' అని అభివర్ణించారు. దీనిపై పోరాటం కేవలం 'చర్య-ప్రతిచర్య' ఆలోచనకే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు సదస్సుకు హాజరైన పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్‌కు మోదీ చురకలంటించారు. "ఉగ్రవాదానికి సంబంధించి ఫైనాన్సింగ్, రిక్రూట్‌మెంట్, రాడికలైజేషన్, సురక్షిత స్థావరాలు సహా మొత్తం నెట్‌వర్క్‌ను మనం నిర్మూలించాలి. ఈ తీవ్రమైన అంశంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని మనం ఒకే గొంతుతో స్పష్టం చేయాలి' అని ఆయన అన్నారు. "ఉగ్రవాదాన్ని తమ విధానంగా మార్చుకుని వారికి ఆశ్రయం, మద్దతు ఇస్తున్న 2లో..

# కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్

## - హైకోర్టులో రేవంత్ సర్కార్‌కు బిగ్ రిలీఫ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టులో బిగ్ రిలీఫ్ లభించింది. ఈ రెండు పథకాల అమలుపై సింగిల్ బెంచ్ విధించిన మధ్యంతర స్టేను హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ రద్దు చేసింది. దీంతో పథకాల అమలుకు ఏర్పడిన తాత్కాలిక న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. దీంతో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది. ఈ నేపథ్యంలోనే ఈ రెండు పథకాల అమలు కోసం 2014 నుంచి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ లాయర్ విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టును ఆశ్రయించారు.
ఈ పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేయకపోవడంతో 2లో..

## ప్రభుత్వ హామీతో ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరించుకున్న సీజేపీ

### - సుప్రీంలో కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల హామీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన యాత్రను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సానుకూల హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు 2లో..

# ఏ ఎన్నికల్లోనైనా ఎన్డీఏ కూటమికి తిరుగులేదు

## - ఓటమి భయంతోనే వైసీపీ ఏకగ్రీవాలు వద్దంటోంది

- మొగల్తూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం
- ప్రజావేదిక సభలో చంద్రబాబు ప్రసంగం
- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో కోర్టుల్లో కేసులు వేస్తున్నారని ఆగ్రహం
- ఏకగ్రీవాలను ప్రభుత్వమే ప్రోత్సహించిందని వెల్లడి



అమరావతి (ప్రశ్న న్యూస్) పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని సీఎం చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ. 73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ. 1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు 2లో..

# అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు

## - వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత అన్న లోకేశ్



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. 2లో..

# ఎమ్మెల్యేల జీతభత్యాలపై చర్చ

- జీతాల కంటే భత్యాలే ఎక్కువ
- పన్ను మినహాయింపుల వెనుక అసలు లెక్క



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విప్‌లు, జీతభత్యాలు, వారికి అందుతున్న రకరకాల అలవెన్సులు, వాటిపై వర్తించే పన్ను నిబంధనలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మరీ ముఖ్యంగా మన తెలంగాణలోని ప్రజా ప్రతినిధులకు అందుతున్న చెల్లింపుల్లో ఏవి జీతంగా పరిగణిస్తారు, ఏవి భత్యాలుగా ఉంటాయి వాటిపై ఆదాయపు పన్ను ఎలా వర్తిస్తుంది అనే అంశాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులకు చెల్లించే మొత్తం మొత్తాన్ని ఒకే రకమైన జీతంగా కాకుండా చట్టంలో పేర్కొన్న వివిధ కేటగిరీలుగా విభజించడం ఈ చర్చకు ప్రధాన కారణంగా మారుతోంది. అయితే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాలు, వారి భత్యాలకు సంబంధించి సోషల్ మీడియాలో ఓ నెటిజన్ చేసిన పోస్ట్ ఆలోచింపజేస్తోంది.
అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలోని ప్రతీ ఎమ్మెల్యేకు జీతభత్యాలు కలిపి రూ. 2.5 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు అందుతున్నాయి. కానీ వారికి అందులో జీతం రూ. 20 వేలు మాత్రం కాగా మిగిలినవి మొత్తం పన్ను పరిధిలోకి రాని అలవెన్సులే ఉంటాయి. ఇక శాసనమండలి ఛైర్మన్‌కు నెలకు 2లో..

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

## - ఆస్ట్రేలియా యూనివర్సిటీతో సింగరేణి, ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో క్రిటికల్ మినరల్స్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాలకు అవసరమైన కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్, ఐఐటీ హైదరాబాద్, ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ యూనివర్సిటీ మధ్య సహకారానికి మార్గం సుగమం అవుతోంది. 2లో..

# హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

## - కమిషనర్ పదవి నుంచి తొలగింపు ఉత్తర్వులపై స్టే



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైడ్రా కమిషనర్ పదవి నుంచి ఏవీ రంగనాథ్‌ను తొలగించి సమర్థుడైన అధికారిని నియమించాలంటూ ఇటీవల తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు సంచలనం రేపిన సంగతి తెలిసిందే. శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన కేసులో విచారణ సందర్భంగా ఏవీ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని మరో అధికారిని నియమించాలంటూ ఉత్తర్వులను ఆయన డివిజన్ బెంచ్ ముందు తాత్కాలికంగా స్టే విధించింది. దీంతో తదుపరి విచారణ పూర్తయ్యే వరకు రంగనాథ్ హైడ్రా కమిషనర్‌గా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రంగనాథ్ అప్పీల్ దాఖలు చేశారు. ఆయన తరపున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. 2లో..

# హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం!

## - హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో విగ్రహాల నిమజ్జనంపై వివాదం మరోసారి ఉత్పన్నమైంది. హైడ్రా సంస్థ తమ పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని ప్రకటించడంతో ఈ వివాదం మొదలైంది. ఈ ప్రకటనకు గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. సమితి ప్రతినిధులు ఈ నిర్ణయాన్ని తప్పుపట్టారు మరియు హైడ్రాకు విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం లేదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూస్తున్న హైడ్రా చర్యలను సమితి తప్పుబట్టింది. 2లో..

# ఓవర్ టు ఢిల్లీ

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించి అధిష్టానం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. పార్టీ నిబంధనలను అతిక్రమించడం, పార్టీకి భంగం కలిగించేలా ప్రవర్తించిన వీరిని పదవుల నుంచి తప్పించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.ముఖ్యంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. కుమార్తె అనుచిత వ్యాఖ్యలు, విమర్శలను కొండా సురేఖ దంపతులు ఖండించలేదు. కుమార్తెకు నచ్చజెప్పే ప్రయత్నానికి బదులుగా తాము సుస్మితను ఎలా నియంత్రిస్తామంటూ కొండా మురళీ చేసిన చేసిన వ్యాఖ్యలు హీట్ పెంచాయి. సుస్మిత ప్లాన్ ఏలో భాగంగా ఇలా కామెంట్ చేసి ఉండొచ్చునని, ప్లాన్ బీ ఏంటో తమకు తెలియదన్నారు. ఇంత జరిగినా పార్టీ నుంచి తీవ్ర విరమ్మలు వచ్చినా కొండా దంపతులు సుస్మిత వ్యాఖ్యలను తప్పుపట్టలేదు, కనీసం ఖండించకపోవడం సీఎం రేవంత్ రెడ్డితో పాటు పార్టీ అగ్రనేతలకు కోపాన్ని తెప్పించి ఉండొచ్చు. దాంతో మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించాలని, క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నివేదికను సైతం ఆయన అధిష్ఠానం వద్ద ప్రస్తావించవచ్చు.కొత్తవారికి అవకాశం కల్పించడం లేదా మంత్రివర్గ విస్తరణ ప్రక్రియకు కొంత సమయం పట్టినా, సురేఖ విషయంలో మాత్రం రాజీ పడే ప్రసక్తి లేదని పార్టీ నుంచి వినిపిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కూడా సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే చర్చించారని.. అందుకే నోరు మెదపకుండా సైలెంట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు నేతలు సురేఖపై తీవ్రమైన చర్యలు తీసుకోకుండా సడలింపు నిమిత్తం ప్రయత్నాలు చేసినప్పటికీ, ఇన్‌ఛార్జి నుండి ఎలాంటి హామీ లభించలేదని తెలుస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం రేవంత్‌రెడ్డికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తే తప్ప, కొండా సురేఖను మంత్రివర్గం నుండి వేటు వేయడం దాదాపు ఖాయంగా మారనుంది. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లనున్నారు. విజయవాడ, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుల విస్తరణపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయి చర్చించనున్నారు. దీనితో పాటు వరంగల్ మామునూరు విమానాశ్రయం పనుల అభివృద్ధి పురోగతిపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలవనున్నారు. రక్షణ రంగానికి సంబంధించిన పెట్టుబడులపై చర్చించేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోనూ సీఎం సమావేశం కానున్నారు. డిసెంబరు 7 నుండి 9 తేదీల్లో ఫ్యూచర్‌సిటీ వేదికగా నిర్వహించనున్నఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో పలు డిఫెన్స్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది.

# ఎమ్మెల్యేల జీతభత్యాలపై చర్చ

రూ.4.11 లక్షలు అందుతుంది. కానీ అందులో జీతం రూ.41 వేలు మాత్రమే కాగా మిగిలింది ట్యాక్స్ ఫ్రీ అలవెన్సుల కోటాలో ఉంటాయి.అయితే జీతం తక్కువ ఉండి అలవెన్సులు భారీగా ఉండటంతో అవి ఆదాయపు పన్ను పరిధిలోకి రాకపోవడం పన్ను నుంచి మినహాయింపు పొందేందుకే ఉద్దేశించి చేసినట్లు కనిపిస్తుందని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. భారత రాజ్యాంగంలో విప్ పదవికి ఎటువంటి ప్రత్యేక నిబంధన లేనప్పటికీ ఓటింగ్ సమయంలో శాసనసభ్యుల హాజరును నిర్ధారించడానికి, సాధారణ సమన్వయం కోసం రాజకీయ పార్టీలు విప్‌లను నియమిస్తుంటాయి.

ఇందులో ఆసక్తికరమైన విషయం ఏంటంటే అధికార పార్టీ నియమించిన ఆరుగురు విప్‌లకు నెలకు దాదాపు రూ. 4 లక్షల జీతం లభిస్తున్నప్పటికీ రికార్డుల్లో మాత్రం వారి వేతనం రూ. 20 వేలుగా చూపుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1064 ద్వారా ముగ్గురు విప్‌లకు మంత్రి హోదా కల్పించింది. పేమెంట్ ఆఫ్ శాలరీస్ యాక్ట్ 1953లోని సెక్షన్ 3, సబ్ సెక్షన్ 4 ప్రకారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల జీతభత్యాలు, ఇతర సౌకర్యాలపై చెల్లించాల్సిన ఆదాయపు పన్నును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.ఈ రూల్ అనేది చట్టం ముందు అందరూ సమానత్వమ అనే సూత్రానికి విరుద్ధంగా ఉండటమే కాకుండా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించేలా ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ నిబంధనను ఇప్పటికే రద్దు చేశాయి. అయితే తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు మాత్రం ఇప్పటికీ ఈ నిబంధనను పాటిస్తున్నాయి. తెలంగాణ శాసనసభ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న వివరాల ప్రకారం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతీ ఎమ్మెల్యేతోపాటు ఆయా నియోజకవర్గాలు, నేరుగా ఎన్నికైన ఎమ్మెల్సీలకు నెలకు రూ.20 వేల జీతంతో పాటు రూ.2.30 లక్షల నియోజకవర్గ భత్యం చెల్లిస్తారు. వీటితో పాటు ఇతర సదుపాయాలు, అలవెన్సులు కూడా ఉంటాయి.ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కొందరు విమర్శకులు ప్రజాప్రతినిధులకు లభించే జీతాలు, భత్యాలను పునసమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ఉద్యోగులు తమ ఆదాయంపై ఆదాయపు పన్ను చెల్లిస్తున్నప్పుడు ప్రజాప్రతినిధులకు అందుతున్న వివిధ రకాల భత్యాలకు ప్రత్యేక నిబంధనలు ఎందుకు ఉండాలనే ప్రశ్నను వారు లేవనెత్తుతున్నారు.

# అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు

ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు.

ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

### బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు.

పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

### ఇంటర్ విద్యలో పురోగతి

ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 వేల అడ్మిషన్లు పెరిగాయని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రూ.1051 కోట్లు అందించామని, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ ఐడీ ఇంటిగ్రేషన్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థులో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చ్-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్ల ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏ ఎన్నికల్లోనైనా ఎన్డీఏ కూటమికి తిరుగులేదు

సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

### మహిళా సాధికారతకు పెద్దపీట

డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఏ ఆడబిడ్డా వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని తీసుకొచ్చామని, ఇప్పుడు దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలు, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా అవకాశాలకు పంపిస్తున్నామని తెలిపారు.

### బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్

బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నాం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగించామని చెప్పారు. గ్రామంలో ఇంకా పేదలు ఉన్నారంటే ఆ గ్రామానికే అవమానమని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీ4 ద్వారా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవస్వామి పాదాల వరకు నీరు పారించామని చెప్పారు. నల్లమల కొండల్లో సొరంగాలు తవ్వి నీటిని తరలించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి నీటిని ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలు తొలుత అనకాపల్లికి, వచ్చే ఏడాది విశాఖకు, ఆ తర్వాత వంశధార ప్రాంతానికి చేరేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నదుల అనుసంధానంతో దేశంలోని నీటి సమస్యలను పరిష్కరించాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.

### పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్య స్థానంగా మారుస్తాం

గత పాలకులు పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని సీఎం విమర్శించారు. దీనివల్ల యువత భవిష్యత్తు దెబ్బతిందన్నారు. ఇప్పుడు పెద్ద ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని తెలిపారు. విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ట్రూ డౌన్ ద్వారా విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతుకు అండగా నిలిచేందుకు విద్యుత్ యూనిట్ ను రూ.1.5 కే అందిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో ఇతర దేశాలతో పోటీ పడేలా ఆంధ్రప్రదేశ్ ఆక్వా ఉత్పత్తులను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలు అందించేలా వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుపైనా దృష్టి పెట్టామని తెలిపారు. నర్సాపురం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు , డెల్టా మోడర్నైజేషన్ వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

### ఎన్డీఏ కూటమికి తిరుగులేదు

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమికి తిరుగులేదని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు వార్డు సభ్యులు, సర్పంచులు కూడా పాలనలో భాగం కావాలన్నారు. అప్పుడే కేంద్రం నుంచి గ్రామీణాభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం అన్నారు. ఓటమి భయంతోనే ఏకగ్రీవాలను వద్దని గొడ్డలి పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఏకగ్రీవాలను ప్రభుత్వాలే ప్రోత్సహించాయని. మున్సిపాలిటీలు, ఆయారాం- గయారాం అనే పరిస్థితి లేకుండా కార్పోరేషన్లలో చైర్మన్, మేయర్ల ఎన్నికను ప్రత్యక్షం చేశామని అన్నారు. గొడ్డలి పార్టీ నేతలు బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించేశారని సీఎం ఆక్షేపించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరక్కుండా అడ్డుకోవటమే గొడ్డలి పార్టీ ఆలోచన అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం లోతుకుంట గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న సుమారు 40 ఎకరాల భూమికి సంబంధించి ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఈ భూమిలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలను సవాల్ చేస్తూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు ధిక్కరణకు సంబంధించిన పిటిషన్ విచారణ సందర్భంగా సింగిల్ బెంచ్ రంగనాథ్ వ్యవహారశైలిపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ కీలక ఆదేశాలు జారీచేసింది. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారి చట్టబద్ధ పాలనకు ఇబ్బందులు కలిగించేఅవకాశం ఉందని సింగిల్ బెంచ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఏవీ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చింది. ఆ కేసు విచారణ సందర్భంగా రంగనాథ్‌పై ఉన్న కోర్టు ధిక్కరణ కేసుల సంఖ్యపైనా సింగిల్ బెంచ్ ప్రస్తావించింది.

గత 5 ఏళ్లలో రాష్ట్రంలో వేలాది కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా సుమారు ఏడాదిన్నర వ్యవధిలో ఒకే అధికారిపై 63 కేసులు ఉండటంపై అసాధారణమని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఆస్తులను, మరీ ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆస్తులను పరిరక్షించడం హైడ్రా కమిషనర్ ప్రధాన బాధ్యతగా కోర్టు పేర్కొంది.సింగిల్ బెంచ్ ఆదేశాలతో ఏవీ రంగనాథ్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. తనపై ఇచ్చిన ఆదేశాలను నిలిపివేయాలని కోరుతూ అప్పీల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఆదేశాల అమలుపై తాత్కాలిక స్టే విధించింది. తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. అదే సమయంలో లోతుకుంట భూములకు సంబంధించి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు హైడ్రా ఎలాంటి చర్యలు చేపట్టరాదని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో నవంబర్ 3న జరగనున్న తదుపరి విచారణలో ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం!

ప్రతి సంవత్సరం మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లో నిమజ్జనం నిర్వహించడానికి తమకు హక్కు ఉందని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో, హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ వివాదం నేపథ్యంలో, విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనే వాదనకు ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని గణేశ్ ఉత్సవ సమితి స్పష్టం చేసింది. ఈ వివాదం ఇరువర్గాల మధ్య తీవ్ర చర్చలకు దారితీస్తోంది, మరియు ప్రజల మధ్య కూడా ఈ అంశంపై విభజన ఏర్పడుతోంది.ఈ వివాదం పట్ల ప్రజల స్పందన కూడా విభిన్నంగా ఉంది. కొందరు హైడ్రా నిర్ణయాన్ని సమర్థిస్తున్నారని, ఇది పర్యావరణ పరిరక్షణకు అవసరమని భావిస్తున్నారు. అయితే, మరికొందరు ఈ నిర్ణయాన్ని సంప్రదాయానికి వ్యతిరేకంగా చూస్తున్నారు. వినాయక చవితి పండుగలో విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది, మరియు ఇది ప్రతి సంవత్సరం జరిగే ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఈ నేపథ్యంలో, ప్రజలు తమ సంప్రదాయాలను కాపాడుకోవాలని కోరుకుంటున్నారు. ఈ వివాదం పట్ల ప్రభుత్వం ఎలా స్పందించబోతుందో చూడాలి. హైడ్రా సంస్థ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటుందా లేదా, లేదా ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలా అనే ప్రశ్నలు నెలకొన్నాయి.ఇది ఒక వైపు, గణేశ్ ఉత్సవ సమితి తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ, ఈ వివాదం పరిష్కారం కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. వారు తమ అభ్యంతరాలను అధికారికంగా తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ వివాదం పరిష్కారం కోసం సమితి మరియు హైడ్రా మధ్య చర్చలు జరగవచ్చని భావిస్తున్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ, ఈ అంశంపై సమగ్రంగా చర్చ జరగాలి. ఈ వివాదం కేవలం ఒక పండుగకు సంబంధించినదే కాకుండా, ప్రజల సంప్రదాయాలను, వారి భావోద్వేగాలను కూడా ప్రభావితం చేస్తుంది. అందువల్ల, ఈ అంశంపై సమాజంలో చర్చలు కొనసాగుతాయి, మరియు ఇది త్వరలోనే పరిష్కారం పొందాలని ఆశిద్దాం.

# కిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

పరిశోధన, ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, ఖనిజాల ప్రాసెసింగ్, రిఫైనింగ్, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయి.క్రిటికల్ మినరల్స్ రంగంలో ఆస్ట్రేలియాతో కలిసి పనిచేయాలని సింగరేణి సంస్థను మోనాష్ యూనివర్సిటీ ఆహ్వానించింది. హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతితో మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం సమావేశమై ఈ రంగంలో ఉన్న అవకాశాలను వివరించింది. మోనాష్ యూనివర్సిటీ డీన్ (ఇంజినీరింగ్) ప్రొఫెసర్ యూనిస్ వెంటికోస్ నేతృత్వంలోని బృందం ఆస్ట్రేలియాలో క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, వెలికితీత, ప్రాసెసింగ్ రంగాల్లో ఉన్న అవకాశాలను సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది.ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్‌కు డిమాండ్ వేగంగా పెరుగుతోందని మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులు వివరించారు. అత్యాధునిక టెక్నాలజీ, పర్యావరణహిత మైనింగ్ పద్ధతులు, వాణిజ్యపరంగా ప్రయోజనకరమైన వ్యూహాలను అభివృద్ధి చేయడంలో తమ వర్సిటీ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పరిశోధన ఫలితాలను కేవలం శాస్త్రీయ పరిధిలోనే కాకుండా.. పరిశ్రమలకు ఉపయోగపడే వాణిజ్య సాంకేతిక పరిష్కారాలుగా మార్చడంలో తమకు అనుభవం ఉందని వెల్లడించారు.క్రిటికల్ మినరల్స్ విషయంలో కేవలం అన్వేషణ, వెలికితీతకే పరిమితం కాకుండా వాటి ప్రాసెసింగ్, రిఫైనింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సమావేశంలో చర్చించారు. ముడి ఖనిజాలను ఇతర ప్రాంతాలకు తరలించడం కంటే స్థానికంగానే ప్రాసెసింగ్, రిఫైనింగ్ వంటి కార్యకలాపాలను అభివృద్ధి చేస్తే అదనపు ఆర్థిక విలువను సృష్టించే అవకాశం ఉంటుందని మోనాష్ వర్సిటీ ప్రతినిధులు వివరించారు. అలాగే సుస్థిర మైనింగ్, పర్యావరణ పరిరక్షణ, మైన్ క్లోజర్ ప్లానింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి వంటి అంశాల్లో పరస్పర సహకారానికి అవకాశాలను పరిశీలించారు. భవిష్యత్తులో క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధన, సాంకేతికత, విద్య, పరిశ్రమల అనుసంధానానికి ఈ భాగస్వామ్యం ఉపయోగపడే అవకాశం ఉంది.ఇప్పటికే బొగ్గు గనుల రంగంలో సుదీర్ఘ అనుభవాన్ని కలిగి ఉన్న సింగరేణి ఇప్పుడు ఇతర ఖనిజాల అన్వేషణపైనా దృష్టి సారిస్తోంది. సింగరేణి సంస్థ తరఫున కర్ణాటకలో బంగారం, రాగి నిక్షేపాల అన్వేషణ ప్రారంభించినట్లు ఆ సంస్థ అధికారులు మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులకు వివరించారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్ రంగంలో అంతర్జాతీయ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి తెలిపారు. మోనాష్ యూనివర్సిటీతో పరిశోధన, ఆధునిక సాంకేతికత, క్రిటికల్ మినరల్స్, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో భవిష్యత్ సహకార అవకాశాలను పరిశీలిస్తామని సింగరేణి సీఎండీ వెల్లడించారు. ఇందులో భాగంగా సింగరేణి ఉన్నతస్థాయి అధికారుల బృందాన్ని త్వరలో ఆస్ట్రేలియాకు పంపించి అక్కడి ఖనిజ వనరులు, మైనింగ్ టెక్నాలజీ, పరిశ్రమల భాగస్వామ్య అవకాశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. మరోవైపు తెలంగాణలోనే క్రిటికల్ మినరల్స్ పరిశోధనను ప్రోత్సహించేందుకు మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కలిసి పనిచేసే దిశగా అడుగులు పడుతున్నాయి.ఖనిజాల అన్వేషణ నుంచి వెలికితీత, శుద్ధి వరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు మైనింగ్ వ్యర్థాల నుంచి కూడా కీలక ఖనిజాలను తిరిగి పొందే అవకాశాలపై పరిశోధన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్రిటికల్ మినరల్స్‌లో పరిశోధన, ఆవిష్కరణలకు తెలంగాణను ఒక కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేయడంతో పాటు పరిశోధన ఫలితాలను వాణిజ్య స్థాయిలో ఉపయోగపడే సాంకేతికతలుగా మార్చడంపై దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ వంటి భవిష్యత్ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాల విషయంలో దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో క్రిటికల్ మినరల్స్ కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణి, ఐఐటీ హైదరాబాద్, మోనాష్ యూనివర్సిటీ మధ్య ఏర్పడే సహకారం తెలంగాణకు పరిశోధన, మైనింగ్ టెక్నాలజీ, ఖనిజ విలువ పెంపు రంగాల్లో కొత్త అవకాశాలను తీసుకురాగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ప్రభుత్వ హామీతో ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహరించుకున్న సీజేపీ

సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మంగళవారం సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల కాలపరిమితిలోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణకు తీసుకెళ్లబోమని, కొత్త కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. గతంలో సీజేపీకి ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు.ప్రభుత్వ హామీలపై సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ స్పందిస్తూ, "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలకు, వాటికి లభించిన న్యాయపరమైన భరోసాకు అనుగుణంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను ఉపసంహరించుకోవడమే సముచితమని భావిస్తున్నాం. న్యాయస్థానం జారీ చేసిన తాజా ఉత్తర్వులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని జులై 25న ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాగా, సీజేపీ తాజాగా తీసుకున్న నిరసన రద్దు నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ 'మంచి పరిణామం'గా అభివర్ణిస్తూ ప్రశంసించారు.

## కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల అమలుపై స్టే విధిస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ అప్పీలుపై మంగళవారం విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 2014 నుంచి అమలు అవుతున్న సంక్షేమ పథకాలను వ్యక్తిగతంగా సవాల్ చేసే హక్కు పిటిషనర్‌కు లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పథకాల వల్ల పిటిషనర్‌కు ఎలాంటి వ్యక్తిగత హక్కుల భంగం జరగలేదని ఆయన పథకం లబ్ధిదారు కూడా కాదని పేర్కొన్నారు.అంతేకాకుండా ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని ప్రభుత్వం తరఫున సుదర్శన్ రెడ్డి వాదించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు సంబంధించిన అంశాలను సవాల్ చేసినందున ఈ కేసును విచారించే పరిధి డివిజన్ బెంచ్‌కు ఉందని తెలిపారు. షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకం కూడా ఉందని వివరించారు.పేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు బాల్య వివాహాల నియంత్రణకు ఈ తరహా సంక్షేమ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వినిపించిన వాదనలను పరిశీలించిన హైకోర్టు డివిజన్ బెంచ్ పథకాల అమలుపై సింగిల్ జడ్జి విధించిన మధ్యంతర స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుకు తాత్కాలికంగా ఏర్పడిన న్యాయపరమైన అడ్డంకి తొలగి లైన్ క్లియర్ అయింది. అయితే ఈ వ్యవహారానికి సంబంధించిన ప్రధాన పిటిషన్‌పై తదుపరి విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయం కూడా కీలకం కానుంది.

# ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు వద్దు

దేశాలకు... ఉగ్రవాదం ఎప్పటికీ ఎవరికీ 'హామీ ఇచ్చే వ్యూహాత్మక ఆస్తి' కాజాలదని గట్టి సందేశం పంపాలి" అని ప్రధాని స్పష్టం చేశారు. షాంఘై సహకార కార్పొరేషన్ కోసం భారత విజన్ వెల్లడించిన ఆయన "భద్రత, అనుసంధానత, అవకాశాలు" అనే మూడు ముఖ్యమైన స్తంభాలని వివరించారు. వీటిలో శాంతి- భద్రత మొదటి స్తంభంగా నిలుస్తాయని పేర్కొన్నారు. "ప్రశాంతమైన, సురక్షితమైన యురేషియా కోసం మన ఉమ్మడి కార్యాచరణ అఫ్గనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వంతో ముడిపడి ఉంది" అని నొక్కిచెప్పిన మోదీ అఫ్గన్ ప్రజలకు భారత్ తన అభివృద్ధి, మానవతా సహాయాన్ని కొనసాగిస్తుందని పునరుద్ఘాటించారు.

పశ్చిమాసియా సంక్షోభంపై మాట్లాడుతూ ఒక ప్రాంతంలో ఘర్షణలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతాయని, ముఖ్యంగా 'ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసులపై' దెబ్బతీస్తాయని మోదీ అన్నారు. "దీనివల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలే అత్యధికంగా నష్టపోతున్నాయి, అందుకే అన్ని రకాల ఉద్రిక్తతలు, యుద్ధాలకు పరిష్కారం యుద్ధభూమిలో సాధ్యం కాదని, కేవలం 'చర్చలు, దౌత్యం' ద్వారానే సాధ్యమని భారత్ పదే పదే నొక్కి చెబుతుంది" అని అన్నారు.మరోవైపు డ్రగ్స్ అక్రమ రవాణా యువతకు, ప్రాంతీయ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించిందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతా బెదిరింపులు, వ్యవస్థీకృత నేరాలు, సమాచార భద్రత, నార్కోటిక్స్ వ్యవహారాలను పర్యవేక్షించే ఎస్‌సిఓ యంత్రాంగాల ద్వారా మరింత బలమైన సహకారం అందించాలని కోరారు. "సకాలంలో చర్యలు చేపట్టడానికి, ఆచరణాత్మక సమన్వయానికి ఇవి సమర్థవంతమైన మాధ్యమాలుగా మారాలి" అని మోదీ పిలుపునిచ్చారు.ఎస్‌సిఓ సహకారం ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందించాలని, భవిష్యత్ కార్యాచరణలో 'ప్రజల మధ్య సంబంధాల'ను కేంద్ర బిందువుగా ఉంచాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. "మన ప్రయత్నాలు యువతకు ఎన్ని కొత్త అవకాశాలను సృష్టించాయి మన పారిశ్రామికవేత్తలకు ఎన్ని కొత్త మార్కెట్లను తెరిచాయి, సాంకేతికత ద్వారా మన రైతులకు ఎంత లబ్ధి చేకూరింది, మన పౌరుల జీవితాలు ఎంతగా మెరుగపడ్డాయి అనేదే మన విజయాన్ని కొలిచే నిజమైన కొలమానం" అని వ్యాఖ్యానించారు.ఈ శిఖరాగ్ర సదస్సుకు కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ అధ్యక్షత వహించి, ఆతిథ్యం ఇచ్చారు. ప్రధాని మోదీతో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ , ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇతర ఎస్‌సిఓ సభ్యదేశాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య సిబ్బందిని ఇతర పనులకు మళ్ళించొద్దు

**- పారిశుద్ధ్య వేతనాలు పొందుతూ ఇతర విధుల్లో ఉన్న వారిని పారిశుద్ధ్య పనులకు కేటాయించాలి**

**- బద్వేలు ఆర్డీవో మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, కమిషనర్‌కు సిఐటియు వినతి**

**బద్వేలు** బద్వేలు పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య విభాగంలో కార్మికులుగా నమోదు కాబడి, అదే హోదాకు సంబంధించిన వేతనాలు పొందుతూ ప్రస్తుతం పారిశుద్ధ్యేతర పనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను గుర్తించి, నిబంధనల ప్రకారం తిరిగి పారిశుద్ధ్య పనులకు కేటాయించాలని బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ ఏ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి బద్వేల్ పురపాలక సంఘం ప్రత్యేక అధికారి, బద్వేల్ పురపాలక సంఘం కమిషనర్ వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కె. శ్రీనివాసులు మాట్లాడుతూ బద్వేల్ పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులుగా నమోదు అయి, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పొందుతున్న కొంతమంది ప్రస్తుతం ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని,దీంతో వాస్తవంగా పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సంఖ్య తగ్గిపోయి, మిగిలిన కార్మికులపై అదనపు పని భారం పడుతోందని,వీధుల శుభ్రత, చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాలువల శుభ్రత తదితర పనులను పరిమిత సంఖ్యలో ఉన్న కార్మికులే నిర్వహించాల్సి వస్తోందని,పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య సేవలను సమర్థవంతంగా నిర్వహించడం కష్టతరంగా మారుతోందని,ఒకవైపు పట్టణ జనాభా, పారిశుద్ధ్య అవసరాలు పెరుగుతుండగా, మరోవైపు అందుబాటులో ఉన్న సిబ్బందిని ఇతర పనులకు వినియోగించడం వల్ల పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై తీవ్రమైన పని భారం పడుతోందని,పారిశుద్ధ్య విభాగంలో నమోదు అయిన ప్రతి కార్మికుడి ప్రస్తుత విధులను అధికారులు సమీక్షించాలని,ఎవరు ఏ హోదాలో నియమితులయ్యారు? ప్రస్తుతం ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు? ఏ పనులు చేస్తున్నారు? ఏ హోదాకు సంబంధించిన వేతనాలు పొందుతున్నారు? అనే అంశాలపై పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పారిశుద్ధ్యేతర విధుల్లో కొనసాగుతున్న వారిని గుర్తించాలని,ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులపై అదనపు పని భారం మోపకుండా, అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరానికి అనుగుణంగా సముచితంగా కేటాయించాలని,కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం, పని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పని విభజన చేపట్టాలని, ఒకే కార్మికుడిపై అధిక పనిభారం పడకుండా చర్యలు తీసుకోవాలని,పట్టణ పారిశుద్ధ్యం కేవలం కార్మికుల సమస్య మాత్రమే కాదని, ఇది ప్రజారోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన అంశమని,అందుబాటులో ఉన్న పారిశుద్ధ్య సిబ్బందిని పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులకు వినియోగించి, ప్రతి వార్డు పరిధిలో తగినంత మంది కార్మికులను కేటాయించాలని, తద్వారా పట్టణంలో చెత్త సేకరణ, వీధుల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడుతుందని,ఈ అంశంపై అధికారులు తక్షణమే స్పందించి పారిశుద్ధ్య విభాగంలోని సిబ్బంది విధులను సమీక్షించాలని, ఇతర విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులను నిబంధనల ప్రకారం తిరిగి పారిశుద్ధ్య పనులకు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో-కన్వీనర్ పి.సి. కొండయ్య, యూనియన్ అధ్యక్షులు ఎన్. సత్యరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు డి. హరి, ఉపాధ్యక్షులు జి. శ్రీనివాసులు, ఎన్. పాలయ్య, ప్రధాన కార్యదర్శి కె. నాగేంద్రబాబు, కార్యదర్శి పి. శ్యామ్ ప్రవీణ్, కోశాధికారి కె. శివకుమార్, కమిటీ సభ్యులు పి. రామయ్య పాల్గొన్నారు



## శాఖంబరి అలంకరణలో హనుమంతుడు



**బద్వేలు** బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్ లో వెలిసినటువంటి శ్రీ అభయాంజనేయ స్వామి చౌడమ్మ తల్లి దేవస్థానంలో శ్రావణమాసం ఆరంభంతో మూడవ మంగళవారం సందర్భంగా స్వామి వారికి పలు రకాల కూరగాయలతో శాఖంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ శ్రావణమాసం స్వామి వారికి ప్రీతికర వారం అని అందులోను స్వామి కి పచ్చదనం అంటే చాలా ఇష్టం అని స్వామి ఆలా సంతోషం గా ఉన్నపుడు మనం మనసు లో కోరిన కోరికలు నెరవెరతాయి అని అలాగే మృత్యువాతలో ఉన్న వాలు కూడా మృత్యువాత తొలగిపోతుంది అని భయ దోష గండ దోష తొలగిపోయి చాలా మనసుకు సంతోషం గా ఉంటుంది అని తెలిపారు స్వామి వారిని దర్శించుకోవటాని పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు తదుపరి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదలను అందిచి స్వామి వారి అలంకరణ కూరగాయలను కూడా వచ్చిన భక్తులకు అందిచారు ఈ కార్యక్రమం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉపాసకులు శ్రీశ్రీ పెంచలయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు,ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెంచలయ్య ధర్మపత్ని చంద్రకళ గారి కుటుంబ సభ్యులు, విజయన్నా అధినేత ముమ్మడి రెడ్డి. నాగేంద్ర రెడ్డి గాపలువురు ప్రముఖులు,ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు

## తిమ్మనాయునిపేటలో ఇంటింటా తెలుగుదేశం...



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మనాయుని పేట గ్రామంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటా తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి గ్రామ టిడిపి నాయకులు కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారు ప్రజలకు వివరించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను నంద్యాల రామేశ్వర్ రెడ్డి గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల రామేశ్వర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రకళ, దాసరి గోపాల్, నాగరాజు, గురు కుమార్, చిన్న పాపోడు, హుస్సేన్ భాష, రామయ్య, వెన్నుపూస రామచంద్రారెడ్డి, పల్లె వెంకటేశ్వర్ రెడ్డి, ఇంకా టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెన్షన్లు పంపిణీ చేసిన టిడిపి నాయకుడు వీఆర్ లక్ష్మీరెడ్డి



**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచన మేరకు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను బనగానపల్లె నియోజకవర్గ కో కన్వీనర్ వి ఆర్ లక్ష్మీరెడ్డి పంపిణీ చేశారు.?1000 ఉన్న పెన్షన్ 4000 రూపాయల వరకు ఒకేసారి పెంచిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి దక్కిందని వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు ప్రజలు పాల్గొన్నారు.

## భర్త మరణంతో ఆగని ఎన్టీఆర్ భరోసా

**- మరుసటి నెల నుంచే భార్యకు ఎన్టీఆర్ వితంతు పింఛను**

**- ఏపీ ప్రభుత్వం మానవీయ నిర్ణయం. ఎదురుచూపులకు చెక్**

**- నెల తిరగకుండానే వితంతువులకు రూ.4000 పింఛను మంజూరు.**



**తుగ్గలి:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో వితంతు మహిళలకు భరోసా కల్పిస్తూ కీలక సంస్కరణలు చేపట్టింది. ఈ నూతన కీలక సంస్కరణల వలన తుగ్గలి మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లె గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మంగళ నారాయణ మృతి చెందడంతో,భర్త చనిపోయిన మరుసటి నెలకి మంగళ లక్ష్మీదేవి కు ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్ మంజూరు అయింది. మంగళవారం రోజున ఉప్పర్లపల్లె గ్రామం సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉప్పర్లపల్లె సొసైటీ అధ్యక్షులు అప్పా వేణు ఆమెకు పింఛన్ ను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు అప్పా వేణు మాట్లాడుతూ గతంలో పింఛను పొందుతున్న భర్త మరణిస్తే,భార్యకు వితంతు పింఛను రావడానికి 6 నుంచి 7 నెలల సమయం పట్టేది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న వితంతు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారని,దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్పౌజ్ కేటగిరీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని,దీని ప్రకారం పింఛనుదారుడైన భర్త మరణించిన వెంటనే,అర్హతగల భార్యకు మరుసటి నెల నుంచే నెలకు రూ.4000 వితంతు పింఛను మంజూరు చేస్తున్నారని ఆయన తెలియజేశారు. ఈ మానవీయ నిర్ణయం ద్వారా ఎంతో మంది వితంతు మహిళలకు తక్షణ ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ టైలర్ కంబగిరి,సచివాలయ ఉద్యోగులు,పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నుండి టీడీపీలోకి భారీగా చేరికలు



**చిట్వేలి** ఓబులవారిపల్లి మండలం చెన్నరాజుపోడు పంచాయతీ పరిధిలోని గాడివారిపల్లి అరుంధతివాడలో వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరిక జరిగాయి. రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, యువ నేత ముక్కా సాయి వికాస్ రెడ్డి ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. నూతనంగా పార్టీలలో చేరిన వారికి ముక్కా రూపానంద రెడ్డి, ముక్కా సాయి వికాస్ రెడ్డి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని వారు సూచించారు. మాజీ సర్పంచ్ బత్తల చలపతి, సుంకర చిన్న ఆధ్వర్యంలో పలువురు టీడీపీ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరామని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో టీడీపీకి మరింత బలం చేకూర్చేలా కార్యకర్తలతో కలిసి పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రెండు జింకలు మృతి



**చిట్వేలి** పుల్లంపేట మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతి చెందాయి. పుల్లంపేట మండలం అనంతసముద్రం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రెండు జింకలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన జింకలను పరిశీలించి, ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. జింకలను ఢీకొన్న వాహనం ఆచూకీ కోసం అధికారులు చర్యలు చేపట్టారు. అటవీశాఖ అధికారులు మృతి చెందిన జింకలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించారు.

## ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఘనంగా 'అమిగోస్ టి.పి.ఎల్' క్రీడా సంబరం ప్రారంభం...

**- ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన షేక్. మొహమ్మద్ జాకీర్**




**రేణిగుంట** తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో "అమిగోస్ తిరుపతి ప్రిమియర్ లీగ్ – మొదటి విడత" క్రికెట్ పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి, ఈ క్రీడా వేడుకకు తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ ముఖ్య అతిథులుగా హాజరై దివ్య జ్యోతిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు, సెప్టెంబర్ 1వ తేదీ నుండి సెప్టెంబర్ 10వ తేదీ వరకు మొత్తం 10 రోజుల పాటు జరగనున్న ఈ లీగ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటుండగా, ఇందులో రెండో విభాగంలో లేని జట్లు (మొదటి విభాగం జట్లు) రాము ఎలెవన్ ఏర్పేడు, సూర్య మరియు అచ్యుత్ క్రికెట్ అకాడమీ తిరుమల, అక్షర ఈవెంట్స్ మరియు క్యాటరర్స్ శ్రీకాళహస్తి, డి.సి.సి వెంకటగిరి, మరియు ఆర్కే మేకప్ స్టూడియో మరియు అకాడమీ తిరుపతి టైగర్స్ అనే 5 జట్లు ఉన్నాయి, ఈ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేత జట్టుకు లక్షన్నర రూపాయల (?1,50,000/-) నగదు బహుమతితో పాటు అందమైన విజేత కప్పును అందజేస్తారు, ఇకపోతే ఈరోజు ఉదయం అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన తొలి ఆటలో ఎస్కేఎస్ తిరుచానూరు మరియు సన్‌రైజర్స్ రేణిగుంట జట్లు హోరాహోరీగా తలపడగా, ఈ రోజటి లీగ్ మ్యాచ్‌లోనే సన్‌రైజర్స్ రేణిగుంట జట్టు తరపున ఆడిన జబ్బార్ ట్రస్ట్ అధినేత షేక్ ఫరీద్ బాబా కుమారుడు, యువ ఆల్‌రౌండర్ షేక్. మొహమ్మద్ జాకీర్. అత్యంత అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రతిభను కనబరిచి మ్యాచ్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచాడు, మైదానంలో పదునైన బౌలింగ్‌తో శత్రు జట్టుకు చెందిన 3 కీలక వికెట్లను నేలకూల్చడమే కాకుండా, సమయస్ఫూర్తితో కూడిన ప్రదర్శనతో సన్‌రైజర్స్ రేణిగుంట జట్టును విజయతీరాలకు చేర్చి ఈరోజు మ్యాచ్‌ను గెలిపించడంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు, గతంలో జరిగిన మునుపటి అంతిమ సమరంలో కూడా ఇదే రీతిలో మెరిసిన షేక్. మొహమ్మద్ జాకీర్., ఈరోజు మ్యాచ్‌లోనూ తన విశేష ప్రతిభతో రేణిగుంట కీర్తి ప్రతిష్టలను తిరుపతి జిల్లా స్థాయిలో మారుమోగేలా చేయడంతో రేణిగుంట ప్రజలు, క్రీడాభిమానులు మరియు ప్రముఖులు ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సిపిస్ రద్దు

**తిరుపతి.**సిపిస్ రద్దు కోసం గుంటూరులో ఉద్యోగుల సమర శంఖం విజయవంతం కలెక్టరేట్ నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు భారీ ర్యాలీ వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులుకాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్‌తో ఆంధ్రప్రదేశ్ సిపిస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన భారీ కార్యక్రమం విజయవంతమైంది. గుంటూరు కలెక్టరేట్ నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని సిపిస్ రద్దు చేయాలని నినదించారు. ఉద్యోగుల ఐక్యతను చాటుతూ సాగిన ఈ ర్యాలీ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఏపీ జిఏ రాష్ట్ర అధ్యక్షులు క్ .ర్ . సూర్యనారాయణ , ప్రధాన కార్యదర్శి రమేష్ , ఏపీసీపీఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు బాజీ పఠాన్ , అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్, ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వర్ రావు , రాష్ట్ర శాఖ బాధ్యులు హాజరై ఉద్యోగుల ఉద్యమానికి తమ మద్దతును ప్రకటించారు.

అలాగే తిరుపతి జిల్లా అధ్యక్షులు వంకీపురం పవన్, జనార్దన్, జహీర్ అబ్బాస్, హుస్సేన్, శాంత భాయ్, రాంభూపాల్ రెడ్డి, ఉమా మహేశ్వర్, రామనరసింహ తదితరులతో పాటు గుంటూరు శాఖ నాయకులు, రాష్ట్రంలోని 26 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మరియు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ మాట్లాడుతూ "సిపిస్ రద్దు అనేది ఉద్యోగుల న్యాయమైన హక్కు. మన ఇంట్లో ఉండి, మన ఊరిలో ఉండి కార్యక్రమాలు నిర్వహిస్తే మాత్రమే ప్రభుత్వం దిగి రాదు. రాజధాని నడిబొడ్డున ఉద్యోగులందరం ఐక్యంగా మన గొంతును వినిపించి నప్పుడే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి ఏర్పడుతుంది. ఈరోజు గుంటూరులో కలెక్టరేట్ నుంచి వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు జరిగిన ఈ భారీ ర్యాలీ ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనం. ""ఈరోజు జరిగిన కార్యక్రమం ఒక ముగింపు కాదు.. భవిష్యత్ ఉద్యమానికి నాంది. రాష్ట్రంలో ఉన్న అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని, అందరి మద్దతుతో రాబోయే రోజుల్లో మరింత భారీ స్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తాం. సిపిస్ రద్దు చేసి ఒపీస్ పునరుద్ధరించే వరకు దశల వారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తాం."“వేలాది మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్ర మాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఉద్యోగికి కృతజ్ఞతలు. ఉద్యోగుల ఐక్యతే మన బలం. అన్ని సంఘాలు ఒక్కతాటిపైకి వస్తే సిపిస్ రద్దు సాధించడం ఖాయం." అని చీర్ల కిరణ్ స్పష్టం చేశారు. అలాగే భవిష్యత్ కార్యాచరణపై కీలక ప్రకటన చేసారు, రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో మరింత విస్తృతమైన ఐక్య ఉద్యమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ రూపొంది స్తామని తెలిపారు. త్వరలోనే తదుపరి కార్యక్రమాల వివరాలను ప్రకటిస్తామని వెల్లడించారు.

## గురజాల మున్సిపల్ చైర్మన్ షేక్ బడే జానీ వైసీపీని వీడి టిడిపి లోకి చేరిక

**- బడే జానీ తో పాటు వైసిపి కౌన్సిలర్ లు, పలు కుటుంబాలు టిడిపిలో చేరిక**

**- టిడిపి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే యరపతినేని**



**పిడుగురాళ్ల,** పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గురజాల టౌన్ లోని వివిధ వార్డులకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీ విధానాల పట్ల విసుగు చెంది, గురజాల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి మరియు తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చి, మంగళవారం గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీ లోకి చేరారు.పార్టీలోకి చేరిన వారు :1) షేక్ బడేజానీ – ముస్లీం (మున్సిపల్ ఇంచార్జ్ చైర్మన్ 9వ వార్డు) 2) షేక్ అలీ మున్నీసా బేగం – ముస్లీం (8వ వార్డు కౌన్సిలర్) 3) కుక్కమూడి అనిల్ – యస్సీ మాదిగ (20వ వార్డు కౌన్సిలర్) 4) బండి రవి – బీసీ రజక (14వ వార్డు కౌన్సిలర్) 5) తూముల లింగాచారి – బీసీ విశ్వబ్రాహ్మణ (1వ వార్డు కౌన్సిలర్) 6) మంచి యశోదా – బీసీ యాదవ (13వ వార్డు కౌన్సిలర్) తదితరులు గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యరపతినేని శ్రీనివాసరావు వారందరికి టిడిపి పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బడేజానీ మీడియాతో మాట్లాడుతూ, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు కార్యదీక్షత, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. గురజాల నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తోపాటు తాము కూడా పాల్గొంటూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని బడేజానీ అన్నారు.

# హిజ్రాలు దందా మాములుగా లేదుగా...

**రంగారెడ్డి** గతంలో రైళ్లలో మాత్రమే హిజ్రాలు కనిపించేవారు. ప్రయాణికులనుంచి డబ్బులు వసూలు చేసేవారు. డబ్బులు ఇవ్వకపోతే వీరంగం సృష్టించేవారు. హిజ్రాల తాకిడి పెరిగిపోవడంతో రైల్వే శాఖ అధికారులకు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు.. రైల్వే శాఖ ఎంతగా కట్టడి చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.రైళ్లను దాటి ఇప్పుడు హిజ్రాలు ఏకంగా గ్రామాల మీద పడుతున్నారు. పెళ్లిళ్లు లేదా ఏదైనా వేడుకలు చేసుకుంటే అక్కడికి వచ్చి వీరంగం సృష్టిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. అంతేకాదు ఇంకా రాయడానికి వీలైన దుర్మార్గమైన చేష్టలకు పాల్పడుతున్నారు. హిజ్రాల వ్యవహార శైలి వల్ల ఇబ్బంది పడ్డవారు పోలీసులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఆ హిజ్రాలను గుర్తించి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు. ఆయనప్పటికీ హిజ్రాల వ్యవహార శైలి మారిపోవడం లేదు. పైగా ఆశీర్వాదం పేరుతో హిజ్రాలు శుభకార్యాలు జరిగే చోటుకు వస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే వీరంగం సృష్టిస్తున్నారు.తాజాగా తెలంగాణ రాష్ట్రంలో ఓ ప్రాంతంలో ఓ కుటుంబానికి చెందినవారు వివాహం నిర్వహిస్తున్నారు. ఆ వేడుకను అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. వేడుక జరిగే ఫంక్షన్ హాల్ వద్దకు హిజ్రాలు వచ్చారు. డబ్బులు డిమాండ్ చేశారు. ఏకంగా 50,000 ఇవ్వాలని కోరారు. దానికి ఆ వివాహం జరిగే కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. పైగా ఫంక్షన్ హాల్ తలుపు వద్ద కూర్చున్నారు. చివరికి 20000 ఇస్తామని చెబితే హిజ్రాలు ఊరుకోలేదు. బూతులతో రెచ్చిపోయారు. అంతేకాదు మరో 10 మందిని పిలిపించుకొని హంగామా సృష్టించారు. చివరికి 35000 తీసుకొని వెళ్ళిపోయారు. ఈ విషయాన్ని హైదరాబాద్ నగరానికి చెందిన ఒక వ్యక్తి సోషల్ మీడియా వేదికగా బయటపెట్టాడు."హిజ్రాల దూకుడుకు అడ్డుకట్ట వేసే మార్గం లేదా. తెలంగాణ పోలీసులు వారిని ఏమీ చేయలేరా. ఈ స్థాయిలో ధర్నానికి పాల్పడుతుంటే ఏం చేయాలి.. శుభకార్యాలు జరిపే ఇండ్ల మీద పడుతున్నారు. బూతులతో రెచ్చిపోతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే దాడులు చేసేందుకు కూడా వెనుకాడటం లేదు. ఇటువంటివారిని ఎలా అడ్డుకోవాలి.. ఎలాంటి చర్యలు చేపడితే ఎటువంటి వారు ఇండ్ల మీదికి రారు.. పోలీసులు ఏమైనా పరిష్కార మార్గం చూపిస్తారా.. ఇటువంటివారు వస్తారేమోనని భయంతో పెళ్లి వేడుకలు కూడా జరుపుకోవడం కష్టంగా ఉందని" ఆ వ్యక్తి వాపోయాడు. మరి హిజ్రాల దూకుడు ఎలా అడ్డుకట్ట వెయ్యాలో తెలంగాణ పోలీసులే ఒక నిర్ణయం తీసుకోవాలని సోషల్ మీడియాలో విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సెప్టెంబర్ 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన

- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది.న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు.గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు.కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు.కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు."భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# అక్రమ మైనింగ్లో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హస్తం ఉంది

**నెల్లూరు** ఎంఇ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పై మాజీమంత్రి అనిల్ కుమార్ యాదవ్ మరొకసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పెద్ద తోపు ఏమి కాదు... డబ్బుండే వాళ్లే మోసం చేయడంలో దిట్ట..వైట్ కాలర్ వేసుకున్న వాళ్లు చాలామంది చేసే పనులే వేమిరెడ్డి చేస్తున్నాడని అన్నారు. ముమ్మాటికి అక్రమ మైనింగ్లో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హస్తం ఉంది. రెండు రోజుల క్రితం మైనింగ్ అక్రమాలపై ప్రశ్నిస్తే ఇంతవరకు సమాధానం లేదు... ప్రెస్ మీట్ తరువాత అపార్ట్మెంట్ నుంచి ఆఫీస్ ని ఊటుకూరు లో వేమిరెడ్డికి చెందిన వ్యక్తి ఇంట్లోకి మార్చారు. నేను ఆధారాలతో మాట్లాడుతున్నాను కాబట్టి ఈరోజు లేదా రేపు వేమిరెడ్డి దంపతులు చంద్రబాబును కలిసి నన్ను అరెస్టు చేయమని ఖచ్చితంగా అడుక్కుంటారు. అసలు వేమిరెడ్డికి డవు కి ఏంటి లింక్ అని అడిగితె దారుణలపై ప్రశ్నిస్తే... ఏం సంబంధం లేదని రవిచంద్ర మాట్లాడటం సిగ్గుచేటు. కేంద్ర మంత్రి జైశంకర్ కి స్వయంగా వేమిరెడ్డి లేఖ రాశారు... అందులో చైనా కు చెందిన 5 మందికి ఇక్కడ మైనింగ్ వ్యాపారానికి అనుమతి ఇవ్వాలని వేమిరెడ్డి కోరారు. అందులో ఒకడు ఈ డవ్.. ఈ డవు ఎవరి చెంచా అనేది తేలిపోయింది. వేమిరెడ్డి ఆధ్వర్యంలో అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నా.. సూటిగా సమాధానం చెప్పండని అన్నారు.- 2024 -11-05 మేయర్ గా గిరిజన మహిళా ఉంది... కానీ మేయర్ గా మరోవ్యక్తి చైనాలో చలామనీ ఎలా అవుతాడు. వేమిరెడ్డికి చెందిన రమణకుమార్ అనే వ్యక్తితో కలిసి ఈ ఫేక్ మేయర్ చైనాలో ఇంకెన్ని దారుణాలు చేసాడో అని అనుమానాలు ఉన్నాయి. సినోమా అనే కంపెనికి వెళ్లి నేనే మేయర్ ని అంటూ రమణకుమార్ తో కలిసి చీటింగ్ చేశారు... దేశ పరువును చైనాలో తీస్తున్నారు. ఇది తీవ్రమైన నేరం. ఇది ప్రభాకర్ రెడ్డికి తెలియదా... తెలిసే చేశారా చంద్రబాబు, లోకేష్ ఇద్దరూ దీనిపై సమాధానం చెప్పాలి... ఫ్రాడ్ చేసిన వ్యక్తిని ఎందుకు వెనకేసుకొస్తున్నారు ఫేక్ మేయర్ తో ఇంకెన్ని స్కాములు చేసారో వెంటనే బయటపెట్టండి. తెలిసి కూడా దగ్గరపెట్టుకుని ఉన్నాడంటే వేమిరెడ్డితో లోపాయాకరీ ఒప్పందం ఉందనే అనుమానాలు ఉన్నాయి. మైన్ తో పాటు ఇంకా ఎన్ని రహస్యాలు వెళ్తున్నాయో బయటపెట్టాలని అన్నారు. ఇట్లాంటి నేరగాడిని రవిచంద్ర వెనకేసుకోస్తారా... నారాయణ, శ్రీధర్ రెడ్డిని .. అడుగుతున్నా దేశ పరువును పక్కా దేశాల్లో తాకట్టు పెడుతున్న ఫేక్ మేయర్ ని నెత్తిన పెట్టుకుని ఎందుకు తిరుగుతున్నారు. ఇప్పటికైనా బాధ్యత ఉంటే వేమిరెడ్డి బయటికి వచ్చి క్లారిటీ ఇవ్వాలి... ఇలాంటి వ్యక్తిని డిప్యూటీ మేయర్ స్థానం నుంచి వెంటనే తొలగించాలని అన్నారు. -దీనంతటికీ బాస్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి... డబ్బున్నోళ్లు మోసం చేయరా..వైట్ కలర్ క్రిమినల్స్ పట్ల మీ వైఖరి ఏంటి వేమిరెడ్డి గారూ... పక్కా ఆధారాలు చూపించా... కూటమి ప్రభుత్వం ఇలాంటి దొంగ పనులు ఇంకెన్ని చేస్తుందో అనేది మాకు అనుమానం. దేశాద్రోహనికి పాల్పడిన ఘటనపై ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేస్తాం... అక్కడి నేషనల్ మీడియాకి పూర్తి వివరాలు వెల్లడిస్తాం. ఇలాంటి ఫ్రాడ్ గురించి మాట్లాడాలంటే స్థాయి ఉండాల్సిన అవసరం లేదు. మా స్థాయి ఏంటో మాకు తెలుసు... మైన్స్ ఉంటేనే మైన్ గురించి మాట్లాడాలా... నాకు మైన్స్ లేవు... ఓనర్ల బాధలు నాకు చెప్పారు కాబట్టే మాట్లాడుతున్నా . రాజకీయ సేవ ముసుగులో దేశాద్రోహలకు పాల్పడుతున్నారు... ఇది తప్పని చెప్తున్నాం.. మేము కూడా సేవలు చేశాం... కానీ ఇలాంటి ఫ్రాడ్ లు చేయలేదు. విజయ్ మాల్యా.. జి ఎంటర్టైన్మెంట్ అధినేత ఇంకా ఎంతోమంది డబ్బుండే వాళ్లే మోసం చేస్తున్నారు వేమిరెడ్డి కూడా అలాగే చేస్తున్నాడు.

# జిల్లా కలెక్టర్లకు రెడ్ క్రాస్ అవార్డులను అందజేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ గౌరవ అధ్యక్షుడు ఎస్ అబ్దుల్ నజీర్ మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఐఆర్సీఎస్ 2024-25 వార్షిక సర్వసభ్య సమావేశంలో బాపట్ల, కృష్ణా, నెల్లూరు, కాకినాడ, పశ్చిమగోదావరి, నంద్యాల, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లకు రెడ్క్రాస్ అవార్డులను అందజేశారు. రెడ్క్రాస్ యొక్క వివిధ ప్రధాన మానవతా సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు వనరులను సమీకరించడంలోనూ విశిష్ట సహకారం అందించినందుకు జిల్లా కలెక్టర్లను గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు. రెడ్క్రాస్ అవార్డులు పొందిన ఇతర సంస్థలను, అధికారులను కూడా గవర్నర్ అభినందించారు. ఆఖీ కింద వనరులను పెంచడంలో మరియు అవసరమైన వారికి ప్రయోజనం చేకూర్చే నిర్దిష్ట ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడంలో వారి అత్యుత్తమ సహకారాన్ని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తలసేమియా రోగులకు ఆరోగ్య సంరక్షణ అందించేందుకు సంకల్ప్ ఫౌండేషన్, రోటరీ ఇంటర్నేషనల్తో పాటు ఎల్ఎన్4 టాంజియన్స్ ఆర్గనైజేషన్, నిరుపేదలకు కృత్రిమ చేతులను అందించడంలోను, ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఫర్ కార్నియా కలెక్షన్ కోసం ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ (ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఫర్ లాకోటిక్ యాంటి-ఎన్ఇఎ) కోసం సంకల్ప్ ఫౌండేషన్ సహకారం, డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కోసం యువతలో చైతన్యం తీసుకురావడానికి రెడ్ క్రాస్ కృషిని అభినందించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, నంద్యాల, పల్నాడు, తిరుపతి, అంబేద్కర్ కోనసీమ ఇంకా పశ్చిమ గోదావరి మొదలగు ఏడు జిల్లాల పరిధిలో మూడేళ్లుగా రూ.8.50 కోట్లతో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ వారి సహకారంతో 'మీ ఇంటికి మీ డాక్టర్' పథకం కింద 5 లక్షల కుటుంబాలను దత్తత తీసుకుని రెడ్క్రాస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశ జనాభాలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది యువత ఉన్నందున, భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్యం జరుపుకునే సమయానికి విక్షిత్ భారత్ మరియు స్వర్ణ ఆంధ్ర ఏ2047ని నిర్మించడంలో వారు కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు.రాష్ట్రంలోని అన్ని కళాశాలలు/విశ్వవిద్యాలయాలలో యూత్ రెడ్క్రాస్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, అకడమిక్ పాఠ్యాంశాల్లో రెడ్క్రాస్ను అనుసంధానం చేయాలని, యూత్ రెడ్క్రాస్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలిచేందుకు జిల్లా కలెక్టర్ల సహాయాన్ని కోరాలని గవర్నర్ రాష్ట్రంలోని రాష్ట్ర, కేంద్రీయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను కోరారు.రెడ్క్రాస్ ప్రారంభించిన ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ మరియు సింగల్ యూస్ ప్లాస్టిక్ వ్యతిరేక క్యాంపెయిన్లో రెడ్క్రాస్ వాలంటీర్లు మరియు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి ఓ ముఖ్య కార్యనిర్వహణాధికారి అశ్విని కుమార్ పరిదా, యం.డి. రామారావు, చైర్మన్ పి.రామచంద్రరాజు, వైస్ చైర్మన్, డాక్టర్ డి.శ్రీహరిరావు, ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ, ఎ.పి. రాష్ట్ర శాఖ కోశాధికారి, ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి..
- యువతను దేశ భవిష్యత్తుతో అనుసంధానించాలి
- నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప ఉత్సవాలు' :
- పీవీఎన్ మాధవ్

**విజయవాడ :** వికసిత్ భారత్ నిర్మాణంలో సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో కొనసాగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవాలు' నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడ రామారావు కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కార్యశాలను ఆయన ప్రారంభించారు.ప్రధాని మోదీ దేశం కోసం పూర్తి స్థాయి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడని మాధవ్ పేర్కొన్నారు. సమస్యలు, సవాళ్లను ముందుగానే గుర్తించి పరిష్కారాలు చూపుతూ దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని అన్నారు. భారత్లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మోదీకి విశేష గుర్తింపు లభించిందన్నారు. త్రివర్ణ పతాకానికి అంతర్జాతీయంగా గౌరవం పెరగడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.కోవిడ్ సమయంలో ప్రపంచ దేశాలు భారత్ తీవ్రంగా దెబ్బతింటుందని భావించాయని, అయితే దేశీయంగా వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి ప్రజలకు అందించడంతో పాటు ఇతర దేశాలకు కూడా సరఫరా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇబ్బంది లేకుండా ముందుచూపుతో క్రూడ్ ఆయిల్ నిల్వలను ఆరు నెలలకు సరిపడా సిద్ధం చేసినట్లు తెలిపారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ సాధించిన అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న ప్రజల ఆకాంక్ష మేరకు ఆయన ప్రధానిగా ఎదిగారని మాధవ్ అన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేరాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

పిల్లల ఆలోచనలకు పదును పెట్టాలి సేవా సంకల్ప ఉత్సవాల దక్షిణాది రాష్ట్రాల ఇన్ఛార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసి దేశ నిర్మాణంతో అనుసంధానం చేయాలని సూచించారు. 15 ఏళ్ల వయసు నుంచే పిల్లల్లో వికసిత్ భారత్పై అవగాహన కల్పించాలన్నారు.పాఠశాలలకు వెళ్లే కార్యకర్తలు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని విద్యార్థులతో వినయంగా మమేకం కావాలని సూచించారు. గతంలో దేశం ఎలా ఉంది? ప్రస్తుతం ఎలాంటి మార్పులు వచ్చాయి? ఆ మార్పులకు కారణాలేమిటి? భవిష్యత్ భారత్ ఎలా ఉండాలి? అనే అంశాలపై విద్యార్థులతో చర్చలు నిర్వహించాలని చెప్పారు.డ్రాయింగ్, వ్యాసరచన, ప్రసంగం, నాయకత్వ నైపుణ్యాల వంటి పోటీలు నిర్వహించి పిల్లల్లో దేశభక్తి, సృజనాత్మకతను పెంపొందించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్ భారతదేశాన్ని ఎలా చూడాలనుకుంటున్నారో వారి అభిప్రాయాలను సేకరించి వీడియోల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

**మోదీ ఒక్కరి కల కాదు** వికసిత్ భారత్ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరి బాధ్యత కాదని, దేశంలోని ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని ప్రజలకు వివరించాలని సత్యకుమార్ అన్నారు. ఆర్థిక, సైనిక, సాంకేతిక తదితర అన్ని రంగాల్లో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచి విశ్వగురువుగా ఎదగాలన్న లక్ష్యాన్ని యువతకు వివరించాలని సూచించారు.సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని, పార్టీ గుర్తింపుకు మించి సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా కార్యకర్తలు ప్రజల విశ్వాసాన్ని పొందాలని పిలుపునిచ్చారు. చిన్న వయసు నుంచే పిల్లల్లో దేశభక్తి, దేశం పట్ల బాధ్యత, సమాజ సేవ భావనలను పెంపొందిస్తే వారు భవిష్యత్తులో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశంరాష్ట్ర కార్యశాలను రాష్ట్ర ఇన్ఛార్జి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్రెడ్డి పర్యవేక్షించారు. అతిథులను పార్టీ ఉపాధ్యక్షురాలు నిర్మలా కిషోర్ వేదికపైకి ఆహ్వానించారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్జీ సమారోప్ నిర్వహించారు.కార్యశాలకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్నలతో పీవీఎన్ మాధవ్ సమావేశమయ్యారు. పార్టీ కార్యక్రమాల రూపకల్పన, సేవా సంకల్ప ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పలు సూచనలు చేశారు.

# పెట్టిన ప్రతి మొక్కకి జియో టాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చెయ్యాలి



**సిద్దిపేట** వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, పలు అంశాలపైన సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవనమహోత్సవం భాగంగా ప్లాంటేషన్ 83 శాతం పూర్తయిందని జిల్లా టార్గెట్ 17లక్షల 60 వేలకు గాను 14 లక్షల 63 వేలు ప్లాంటేషన్ చేశారని 100 శాతం ప్లాంటేషన్ పూర్తి చెయ్యాలని, పెట్టిన ప్రతి మొక్కకి జియో టాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చెయ్యాలని ఎంపిడిఓ లను ఆదేశించారు.జలసిరి లో భాగంగా వర్షానికి పడిన ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టడం కోసం ప్రభుత్వం ఈ జలసిరి కార్యక్రమం చేపట్టిందని ఆయా మండలాల్లోని ఆశించిన స్థాయిలో పనుల్లో పురోగతి లేనందున అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రతి ఒక్కరిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఫాంపాండ్ కోసం రైతులను గుర్తించి వెంటనే పనులు మొదలు పెట్టాలని, బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్ కోసం గ్రామంలో ఎన్ని ఇలాంటి బోర్లు ఉన్నాయి లెక్కించి ఆయా రైతులతో మాట్లాడి బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్ వలన బోర్లలో నీటి శాతం పెరుగుతుందని తెలపాలి. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్, ఇంకుడుగుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, ముందుగా మండలంలోని ప్రభుత్వ భవనాలు అయిన గ్రామపంచాయతీ భవనాలు, స్కూల్స్, తహసిల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ భవనాలలు, ఎంపిక చేసుకుని ఎస్టిమేట్ వేసి రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ తప్పనిసరిగా ఏర్పాటు చెయ్యాలని ఏపిఓ లను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మొదటి విడతలో మంజూరు అయిన వాటిలో రూఫ్ లెవెల్ మరియు చిన్న చిన్న పనులు ఉన్న నిర్మాణాలను పూర్తి స్థాయిలో ఈ నెల 15 వరకు గృహ ప్రవేశాలు చేసేలా పని చెయ్యాలని, మార్కౌట్, గ్రౌండింగ్ కానీ వాటిని వెంటనే మొదలు పెట్టాలని, నిర్మాణంలో ఆలస్యం అవుతున్న వారితో స్థానిక ప్రజాప్రతిందులతో కలిసి చర్చించి నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. రెండవ విడతలో మంజూరు చేయబడిన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు.విబిజి రామ్ జీ లో చేపడుతున్న మండలాల వారిగా గ్రామాల్లో మంజూరు అయిన అంగన్వాడి, గ్రామపంచాయతీ భవనాలు, ఎస్ఎచ్ జీ భవనాలు పనులు మొదలు పెట్టని వాటిని గ్రామాల్లో గ్రామ సర్పంచ్ పాలకవర్గం తో సమావేశాలు నిర్వహించి భవనాలను మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవనాల నిర్మాణంలో ఉన్నవి భవనాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేయూత పెన్షన్లు డెత్ మార్కింగ్ వెరిఫై ప్రక్రియ పూర్తి చేసి క్లోజ్ చెయ్యాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సిఈఓ మరియు ఇంచార్జీ డిఆర్డిఓ రమేష్, డిపిఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, హౌసింగ్ పిడి భగవంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**రాజన్న సిరిసిల్ల** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ జిల్లా పర్యటనకు రాగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె స్వాగతం పలికి.. పుష్పగుచ్ఛం అందజేశారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న పథకాలు, సంక్షేమం, అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డు కలిగిఉన్న ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న పని వివరాలను అధికారుల ద్వారా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు ఛార్జ్ షీట్ దాఖలు వివరాలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదయిన కేసుల దర్యాప్తు త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారం అందేవిధంగా చూడాలని వివరించారు. ప్రతినెలా చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ సమావేశాల్లో పాల్గొని, ప్రజల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలు, చట్టాల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని సూచించారు.ఖచ్చితంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఏవైనా అభివృద్ధికి సంబంధించి నిధులు పెండింగ్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదల అయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల అభ్యున్నతితో పాటు, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా మరింత కృషి చేయాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లోని పారిశుధ్య కార్మికులకు ఎస్ బీ ఐ బ్యాంక్ ఖాతాలు తీయించాలని, దీంతో కార్మికులకు భీమా సౌకర్యం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వివరాలు వెల్లడించారు. ఎస్ డీ ఎఫ్ కింద ఎస్సీలకు 169 పనులు అంచనా వ్యయం రూ. 4 కోట్ల 29 లక్షలు, ఎస్టీ లకు 38 పనులు అంచనా వ్యయం రూ. 89 లక్షలతో పనులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ ఏడాది మొత్తం 32 అట్రాసిటీ కేసులు నమోదు అయ్యాయని పోలీస్ శాఖ అధికారులు వివరించారు. జిల్లాలో ఎస్సీ 9 ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 337 మంది బాలురు, 80 బాలికలు, మూడు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 106 మంది బాలురు, 179 మంది బాలికలు చదువుతున్నారని తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు లో 97మంది అభ్యర్థులు ఉన్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 1330, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.1540, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.2100 డైట్ చార్జీలు పెంచిందని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే కాస్మొటిక్ చార్జీలు దాదాపు మూడు ఇంతలు పెంచిందని వెల్లడించారు.

# పత్తికొండలో ఉచిత వైద్య సేవా శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్

**పత్తికొండ:** ఆదోని పట్టణంలో ఉన్న విజయ్ హాస్పిటల్ వారు పత్తికొండ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య సేవా శిబిరాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో విజయ్ హాస్పిటల్ వారు చేపట్టిన ఈ కార్యక్రమంఅభినందనీయమన్నారు. పేద, సామాన్య ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య సేవా శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్న విజయ్ హాస్పిటల్ యాజమాన్యాన్ని, డా. రమేష్ నాయక్ ని ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు మరియు చికిత్స అందించారు.



## మైనారిటీ మహిళా యోజన ద్వారా
# మహిళలకు ఆర్థిక సహాయం
**మంత్రి శ్రీధర్ బాబు**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడడానికి ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజనద్వారా పొందే ఆర్థిక సహాయం ఎంతగానో దోహద పడుతూశీదని శాసనసభ వ్యవహారాలు జిల్లా ఇన్ చార్జి మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో జరిగిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ఎమ్ఎల్ సి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్ ఎల్ ఎ అరికేపుడి గాంధీ, హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజబుద్దీన్, ఒబెదుల్ల కొత్వాల్ మైనారిటీ ఫైనాన్స్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి జిల్లా ఇన్ చార్జి మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు.మహిళలను కోటీశ్వర్లును చేయాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం అని పేర్కొన్నారు. స్వయం ఉపాధి చిన్న వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగడానికి ప్రభుత్వం అమలు చేసే ఈ పథకం వారిని ఆర్థికంగా బలోపేతము చేస్తుందన్నారు. మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయ కుటుంబం కోసమే ఖర్చు చేస్తుంది కావున ఈ ప్రజా ప్రభుత్యము మహిళలకు పెద్ద పీట వేసింది అని తెలిపారు.ఈ పథకం క్రింద మేడ్చల్ జిల్లా లో 225 మైనారిటీ మహిళ లబ్ధిధారులకు ఒక్కొక్కరికి 50,000 రూపాయలు చెక్కులను అందించారు. పారదర్శకతను నిర్ధారించడానికి ప్రభుత్వం సహాయ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోకి జమ చేశారు.తుర్క కాశి ముస్లిం వర్గానికి కుల వృత్తి కి ఉపయోగపడే అరవై వేలు విలువ చేసే జనరేటర్, టూల్ కిట్ లను 57 లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రేవంత్ అన్నాకా సహారా -- మిస్కినో కే లియే పథకం క్రింద మైనారిటీల జీవనోపాధి కి అవసరమైన లక్ష రూపాయలు విలువ చేసే మోపెడ్ లను. స్వయం ఉపాది క్రింద మహిళలకు కుట్టు మెషిన్ లను అందించడం జరుగుతుందని . మత, సామాజిక, మౌలిక సదుపాయాల కోసము ఆర్థిక సహాయం, విదేశాలలో ఉన్నత విద్యని అభ్యసించడానికి ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి చవ్వవసాయ పని ముట్లు, రైతు భరోసా, రైతు భీమా పథకాల అమలులో రాష్ట్రము సింహభాగంలో నిలిచిందన్నారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా నైపుణ్యం అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. అనంతరం లబ్దిదారులకు చెక్కుల పంపిణీ , జనరేటర్ ఒ టూల్ కిట్ అందచేశారు.ఈ కార్యక్రమంలో గ్రశీథాలయ చైర్మన్ , అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, ఆర్టిఎ సభ్యుడు, మున్సిపల్ చైర్ పర్సన్స్, సిజిఎల్ డి ఎ ఛైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ , ప్రజాప్రతినిదులు , లబ్దిదారులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
**టార్పాలిన్ కడుతుండగా మరో లారీ ఢీకొని వ్యక్తి మృతి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )లారీపైకి ఎక్కి టార్పాలిన్ కడుతున్న లారీని వెనుక నుంచి మరో భారీ క్రషర్ లోడుతో వచ్చి ఢీకొట్టడంతో లారీ ఎక్కిన వ్యక్తి కిందపడి అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నై నుంచి ప్లైవుడ్ లోడుతో మియాపూర్ వెళ్తున్న టీఎస్ 05 యూసీ 2959 నంబర్ గల టిప్పర్ లారీ తెల్లవారుజామున 3:30 నుంచి 4:00 గంటల మధ్య వర్షం రావడంతో లారీని పక్కన నిలిపి లారీలో ఉన్న ప్లైవుడ్ తడవకుండా ఉండేందుకు బీహారీ రాయ్ (35) లారీ పైకెక్కి టార్పాలిన్ కడుతున్నాడు. అదే సమయంలో కీసర నుంచి తెల్లాపూర్ వైపు అధిక క్రషర్ లోడుతో వెళ్తున్న టీజీ 07 ఎక్స్ 5510 అనే నంబర్ గల 16 టైర్ల లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ప్లైవుడ్ లోడుతో ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ పైనుంచి కిందపడిన బీహారీ రాయ్ తల పగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు . సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# పంచాయితీ ఉందని పిలిపించి దాడి
**పంచాయితీ పెద్దలే గుండాలుగా మారారని బాధితుల ఆరోపణ**

**దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) పంచాయితీ ఉందని పిలిపించి మాట్లాడుతుండగా కొందరు వ్యక్తులు తమపై దాడికి పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటన మంగళవారం జగదేవపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవపూర్ గ్రామానికి చెందిన తేజస్విని అనే యువతి పంచాయితీ ఉందని, మండల కేంద్రంలోని రంగనాయకుల స్వామి దేవాలయం వద్ద మాట్లాడుకుందామని చెప్పడంతో అక్కడికి కొందరు వ్యక్తులు చేరుకున్నారు. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన మన్నె విజయప్రసాద్, మన్నె నవీన్‌కుమార్, మన్నె రాములు, మన్నె సుగుణమ్మ, బుర్కా శోభతో పాటు మరికొందరు అక్కడికి వచ్చినట్లు బాధితులు తెలిపారు.పంచాయితీ సందర్భంగా అక్కడ కూర్చున్న దోమ మొగులయ్య, దోమ నర్సింలు, దోమ పద్మలపై వారు తీవ్రంగా దాడి చేసినట్లు బాధితులు ఆరోపించారు. ఈ ఘటనలో తమకు గాయాలయ్యాయని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జగదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు.పంచాయితీ పెద్దలే గుండాలుగా మారారుసమస్య పరిష్కారం కోసం పంచాయితీకి పిలిచిన కొందరు పెద్దలే తమపై దాడికి పాల్పడటం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సింగారం గ్రామానికి చెందిన వారితో కలిసి వచ్చిన కొందరు వ్యక్తులు జగదేవపూర్ గ్రామానికి చెందిన వారిపై దాడి చేశారని వారు ఆరోపించారు. పంచాయితీ పేరుతో పిలిచి దాడి చేయడం ఏమిటని ప్రశ్నిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను బాధితులు కోరారు.

# ప్లాస్టిక్ కవర్లను వాడమని ప్రతిజ్ఞ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ప్లాస్టిక్ కవర్లను వాడమని సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ వేడుకల్లో ఈ ఘటన చోటుచేసుకుంది.ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికుడు తాను సహజంగా పండిన వాటర్ మిలన్ పుచ్చపండును కేకు లాగా కట్ చేసి పంపిణీ చేశారు. దీనితోపాటు ఒక చేతి సంచిని ఇస్తూ ,జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మహిళలతో ప్లాస్టిక్ కవర్లు వాడమని ప్రమాణం చేయించారు. భవిష్యత్తులో మార్కెట్ కి వెళ్ళినప్పుడు చేతి సంచులు తీసుకెళ్తామని ప్లాస్టిక్ కవర్లు వాడమని కోల రవీందర్ ముదిరాజ్ తన మీద ప్రమాణం చేయించుకున్నాడు. ప్రతి ఒక్కరు కూడా ఇలా చేసినట్లయితే రైతులకు ఉపాధి కల్పించినట్టు పర్యావరణను కాపాడినట్టు ఆరోగ్యాలు కాపాడినట్టుగా అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ నేను సాధ్యమైనంతవరకు పర్యావరణని కాపాడుటకై ఎప్పుడూ నా బండిలో రెండు సంచులు ఒక ప్లేటు ఒక గ్లాసు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ప్లాస్టిక్ కవర్లను నిషేధించవచ్చని,ప్రతి ఒక్కరు కూడా పర్యావరణాన్ని కాపాడకపోతే మనం భావితరాలకు ద్రోహం చేసిన వారమైతామ ని పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు కాలనీ సంఘాలు,అధికారులు, యువకులు, ఉపాధ్యాయులు, పర్యావరణ పై ప్లాస్టిక్ పై చర్చలు జరపాలని,వివిధ కాలనీలో వారాంతపు, అంగళ్ళలో,ఆయా బస్తీలో ఉన్న నాయకులు యువకులు ప్లాస్టిక్ కవర్లో వ్యాపారం చేయకుండా నివారించాలని కోరారు.

### 1000 రోజులుగా గజ్వేల్‌ను పట్టించుకోని కేసీఆర్..
# ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
**- ప్రభుత్వ జీతభత్యాలు, వసతుల రూపంలో రూ.2.24 కోట్లు తీసుకున్నారు.. ప్రజల మధ్యకు రాని ఎమ్మెల్యే ఎందుకు**

**- కాంగ్రెస్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో భారీ బైక్ ర్యాలీ**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన నియోజకవర్గ ప్రజలను పట్టించుకోవడం లేదని, 1000 రోజులుగా ప్రజల మధ్యకు రాకుండా ఎమ్మెల్యే పదవిని నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో లేని ఎమ్మెల్యేగా కొనసాగడం కంటే తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి, టీపీసీసీ పిలుపు మేరకు గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గజ్వేల్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తుంకుంట అంక్ష రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, డీసీసీ ఉపాధ్యక్షుడు మొనగారి రాజు, మాజీ కౌన్సిలర్ సమీర్ నక్క రేగొండ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1000 రోజుల్లో పేదలు, రైతులు, మహిళలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు.రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కొనసాగింపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల సహాయం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రాజెక్టుల పేరుతో భారీగా అప్పులు చేసి తెలంగాణను ఆర్థికంగా ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు.గతంలో పనితీరు సరిగా లేదని పలువురిపై చర్యలు తీసుకున్న కేసీఆర్.. ప్రస్తుతం తన పనితీరును తానే ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉండలేకపోతే తక్షణమే రాజీనామా చేసి, ప్రభుత్వ సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నక్క రాములు గౌడ్, నంగునూరి సత్యనారాయణ, జంగం రమేష్ గౌడ్, ఉడెం శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, షరీఫ్, గుండు లక్ష్మణ్, జకీర్, జహీర్, జహంగీర్, సాయిలు, కొండల్‌రెడ్డి, ఖాదర్, గాజుల శ్రీనివాస్, మున్నా, ప్రభాకర్, అరుణ్, రాములు, జిల్లా మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు
**పాన్ షాపులు, కిరాణా దుకాణాల నిర్వాహకులకు**

**కీసర పోలీసుల అవగాహన**



కీసర(ప్రశ్న న్యూస్) మైనర్లకు పొగాకు, సిగరెట్లు, ఇతర నిషేధిత ఉత్పత్తులను విక్రయించరాదని కీసర పోలీసులు పాన్ షాపులు, కిరాణా దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళవారం కీసర పోలీస్ స్టేషన్‌లో పాన్ షాపులు, కిరాణా దుకాణాల నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులకు చట్టపరమైన నిబంధనలు, వ్యాపార నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పించారు.18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలబాలికలకు పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లు, ఇతర నిషేధిత వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని సూచించారు. చట్టవిరుద్ధమైన లేదా నిషేధిత ఉత్పత్తుల విక్రయానికి దూరంగా ఉండాలని తెలిపారు.దుకాణాల పరిసరాల్లో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా ఇతర అక్రమ కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం కల్పించరాదని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సమాజంలో ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాలు, పొగాకు వంటి హానికరమైన పదార్థాలకు దూరంగా ఉంచేందుకు వ్యాపారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కీసర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్కపల్లి ఆంజనేయులు కోరారు.

# విద్యార్థినులకు ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ
**- గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో**

**లాంచ్ గర్ల్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం**

**- కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )విద్యార్థినులు డిగ్రీ చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అన్నారు. గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో లాంచ్ గర్ల్స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు.కళాశాల విద్యా విభాగం, లాంచ్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ మధ్య జరిగిన అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. మహిళా విద్యార్థుల్లో ఉద్యోగ అవకాశాలు, వ్యవస్థాపకతకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వివిధ శిక్షణ కార్యక్రమాలను అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ సందర్భంగా మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ డాక్టర్ డి. సుజాత మాట్లాడుతూ.. విద్యార్థినులు తాము చదువుతున్న చదువును ఉద్యోగ అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని తన కాళ్లపై తాను నిలబడి ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు కూడా సాధికారత సాధిస్తాయని అన్నారు. కార్యక్రమ శిక్షకురాలు కుమారి దివ్య మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరాల్లో విద్యార్థినులకు కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్ తదితర అంశాల్లో విస్తృతంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు శ్రీమతి బి. కస్తూరిబాయ్, డాక్టర్ ఆర్. సునీత, సి.హెచ్. ఉమారాణి, శ్రీమతి సరోజన, అధ్యాపకులు డాక్టర్ కె. సరోజ, డాక్టర్ సి.హెచ్. శోభారాణి, డాక్టర్ సి.హెచ్. రాజారావు, డాక్టర్ పి. జయరాజు, డాక్టర్ బి. మురళీధర్, నరేష్, అన్వర్, జ్యోతి, స్వర్ణతో పాటు కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్
# పోలీసుల మెరుపు దాడి
**పేకాట ఆడుతున్న ఐదుగురు పట్టివేత**

**9,400/- రూ., 05 మొబైల్ ఫోన్లు,ఒక ఆటో,52 పేక ముక్కలు స్వాధీనం**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)పట్టణ పరిధిలోని బైపాస్ ప్రాంతంలో రామప్ప దేవాలయంకి వెళ్లే దారిలో అక్రమంగా డబ్బులు పందెంగా పెట్టుకొని పేకాట అడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రోజు సాయంత్రం టాస్కోఫ్స్ ఎస్.ఐ వెంకట్రాజం ఆధ్వర్యంలో టాస్కోర్స్ సిబ్బంది పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి నిర్వహించగా పేకాట ఆడుతున్న 05 మందిని అదుపులోనికి తిసుకొని వారి వద్ద 9,400/- రూపాయలు, 05 మొబైల్ ఫోన్లు, ఒక ఆటో,52 పేక ముక్కలు స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో అప్పజెప్పడం జరిగిందని మరో ముగ్గురు పరారీలో ఉన్నారని టాస్కోర్స్ సి.ఐ నటేష్ తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వాటికి స్థావరాలు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని టాస్కోర్స్ సి.ఐ ఈసందర్భంగా హెచ్చరించారు. ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం పోలీస్ వారికి అందించి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు. ఈ టాస్క్ లో టాస్కోర్స్ సిబ్బంది తిరుపతి, రాజేష్, ఉమాపతి, శంకర్, శివరాజ్ పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్
**96 గ్రాముల గంజాయి స్వాధీనం,**

**సరఫరాదారుడిపైనా కేసు: ఇన్స్పెక్టర్ రవికుమార్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గంజాయి అక్రమ విక్రయానికి పాల్పడుతున్న నలుగురు యువకులను గజ్వేల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 96 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4,800 ఉంటుందని పోలీసులు తెలిపారు.

గజ్వేల్ ఎస్సై హరీష్ విధుల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉండగా, ధర్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జి కింద నలుగురు వ్యక్తులు నిషేధిత గంజాయిని ఇతరులకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్సై హరీష్ ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి అక్కడికి చేరుకుని అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు.వారి వద్ద రెండు ప్యాకెట్లలో మొత్తం 96 గ్రాముల గంజాయి లభించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.అరెస్టయిన వారిలో పిట్ల కర్ణాకర్ (18), తండ్రి పోచయ్య, రంగంపేట గ్రామం, గజ్వేల్ మండలం; జాలిగామ సాయికుమార్ (21), తండ్రి యాదగిరి, మక్త మాసన్‌పల్లి గ్రామం; బట్టు లోహిత్ (19), తండ్రి వైకుంఠం, గజ్వేల్; మాదారం సిద్ధు (21), ఎస్సీ కాలనీ, గజ్వేల్ పట్టణం ఉన్నారు.పోలీసుల విచారణలో తాము జగదేవపూర్‌కు చెందిన దేవుని నవీన్ కుమార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి, ఇతరులకు విక్రయిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో నవీన్ కుమార్‌పై జగదేవపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, అతడిని కూడా రిమాండ్‌కు పంపించారు.గజ్వేల్ పోలీసులు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి విచారణ అనంతరం అర్ధరాత్రి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## ప్రేక్షకుల ముందుకు రానున్న ఎమోషనల్ లవ్ స్టోరీ

# ‘కాగితం పడవలు’

### – సెప్టెంబర్ 18న గ్రాండ్ రిలీజ్!



ప్రతి ఒక్కరి జీవితంలోనూ మరువలేని మధురమైన జ్ఞాపకాలు, ఎప్పటికీ గుండెల్లో నిలిచిపోయే తొలి ప్రేమ అనుభూతులు ఉంటాయి. అలాంటి స్వచ్ఛమైన భావోద్వేగాల సమ్మిళితంగా తెరకెక్కిన సరికొత్త ప్రేమకథా చిత్రం ‘కాగితం పడవలు’. వర్ధన్ మరియు కృష్ణప్రియ జంటగా నటిస్తున్న ఈ బ్యూటిఫుల్ లవ్‌స్టోరీకి ఎంజీఆర్ తుకారాం దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ పతాకాలపై కీర్తన నరేష్, టి.ఆర్. ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి విడుదలైన గ్లింప్స్ అలాగే ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, తాజాగా చిత్ర యూనిట్ నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఈ ప్రత్యేకమైన సాంగ్ లాంచ్ కార్యక్రమంలో చిత్ర బృందం సినిమా విశేషాలను పంచుకుంటూ ప్రేక్షకుల ముందుకు రానున్న తమ అనుభవాలను మనసారా వెల్లడించారు. ఈ సందర్భంగా హీరో వర్ధన్ మాట్లాడుతూ, ‘కాగితం పడవలు’ ప్రయాణం ఒక చిన్న కాలువలో మొదలైందని, అయితే ఊహించని విధంగా తాము ఒక విశాలమైన సముద్రంలోకి ప్రవేశించిన అనుభూతి కలిగిందని భావోద్వేగంతో చెప్పారు. ఈ ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురైనా, నిర్మాతల సహకారంతో సినిమాను పూర్తి చేయగలిగామని, ఈ రోజుల్లో సినిమా తీయడం ఎంత కష్టమో దాన్ని ప్రేక్షకులకు చేరవేయడం అంతకంటే పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. దర్శకుడు తుకారాం ఈ చిత్రాన్ని చాలా అద్భుతంగా తెరకెక్కించారని ప్రశంసిస్తూ, సెప్టెంబర్ 18న అందరూ థియేటర్లలో చూసి సపోర్ట్ చేయాలని కోరారు. అలాగే దర్శకుడు ఎంజీఆర్ తుకారాం మాట్లాడుతూ, తమ చిత్రానికి నిజమైన హీరోలు తమ నిర్మాతలేనని, వారి సహకారం లేకపోతే ఈ ప్రాజెక్ట్ ఇంత దూరం వచ్చేది కాదని కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మనిషి జీవితంలోనూ ఒక అందమైన ప్రేమకథ ఉంటుందని, థియేటర్లలో ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ తమ గతాన్ని, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారని భరోసా ఇచ్చారు. ఈ సినిమాను ప్రేక్షకులంతా థియేటర్లలో చూసి అద్భుతమైన అనుభూతిని పొందాలని ఆకాంక్షించారు. ఈ చిత్రంతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్న హీరోయిన్ కృష్ణప్రియ మాట్లాడుతూ, తెలుగులో తనకు ఇది రెండవ సినిమా అని, దర్శకుడు తుకారాం గారు చూపిన ప్యాషన్ తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఇందులో తనకు చాలా ప్రాధాన్యత ఉన్న మంచి పాత్ర దక్కిందని, ఈ నెల సెప్టెంబర్ 18న సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో అందరూ థియేటర్లకు వచ్చి సినిమాను విజయవంతం చేయాలని కోరారు. నిర్మాత అంజనప్ప మాట్లాడుతూ, ఈ సినిమా నిర్మాణం కోసం యావత్ టీమ్ ఎంతో శ్రమించిందని, దర్శకుడి విజన్‌తో పాటు డీవోపీ మరియు మేనేజర్ పడిన కష్టాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. ఇక డీవోపీ రుద్రసాయి మాట్లాడుతూ, ‘కాగితం పడవలు’ కేవలం ఒక సినిమా కాదని, దాని వెనుక పెద్ద ఎమోషన్ ఉందని, ప్రస్తుత రోజుల్లో మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారని, ఈ చిత్రం కూడా అందరికీ కచ్చితంగా నచ్చుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా సెప్టెంబర్ 18న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. AIS.నౌఫల్ రాజా సంగీతం అందించిన ఈ చిత్రానికి రుద్రసాయి సినిమాటోగ్రఫీ, జెస్విన్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. రెహమాన్ అందించిన సాహిత్యంతో పాటు కిరణ్ కాస్ట్యూమ్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

## ప్రభాస్ ‘కల్కి 2’పై నాగ్ అశ్విన్ కీలక అప్‌డేట్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ ‘కల్కి 2’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా తొలి భాగం ‘కల్కి 2898 ఏడీ’ దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భారీ విజయాన్ని అందుకోవడంతో.. సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది.

ఈ నేపథ్యంలో తాజాగా దర్శకుడు నాగ్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి ఇప్పటివరకు కేవలం 10 రోజుల షూటింగ్ మాత్రమే పూర్తయిందని నాగ్ అశ్విన్ వెల్లడించారు.. దీంతో సినిమా షూటింగ్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందనే విషయం స్పష్టమవుతోంది. ప్రస్తుతం ప్రభాస్ తన చేతిలో ఉన్న ఇతర భారీ ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఆ సినిమాల కమిట్‌మెంట్స్ పూర్తయి ఆయన పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత ‘కల్కి 2’ షూటింగ్‌ను వేగంగా కొనసాగించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ‘కల్కి 2898 ఏడీ’లో భవిష్యత్ ప్రపంచాన్ని, పురాణాలను, సైన్స్ ఫిక్షన్ అంశాలను కలిపి నాగ్ అశ్విన్ సరికొత్త సినిమాటిక్ వరల్డ్‌ను సృష్టించారు. ప్రభాస్ భైరవ పాత్రలో కనిపించగా, అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇక కమల్ హాసన్ పోషించిన యాస్కిన్ పాత్ర చివర్లో సీక్వెల్‌పై మరింత ఉత్కంఠను పెంచింది. మొదటి భాగం చివర్లో యాస్కిన్‌కు సంబంధించిన కథను కీలక మలుపులో వదిలేయడంతో.. రెండో భాగంలో ప్రభాస్, కమల్ హాసన్ పాత్రల మధ్య జరిగే సంఘర్షణ ఎలా ఉండబోతుందనే దానిపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘కల్కి 2’లో ప్రభాస్‌తో పాటు కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో కొనసాగనున్నారు.

ముఖ్యంగా కమల్ హాసన్ విలన్ షేడ్ ఉన్న యాస్కిన్ పాత్రలో కనిపించనుండటంతో ఈ సీక్వెల్‌లో ఆయన పాత్రకు మరింత ప్రాధాన్యత ఉండే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అమితాబ్ బచ్చన్ పోషించిన అశ్వత్థామ పాత్ర కూడా కథలో కీలకంగా మారనుంది. తొలి భాగంలో ఈ పాత్రకు వచ్చిన స్పందన నేపథ్యంలో సీక్వెల్‌లో అశ్వత్థామకు సంబంధించిన ఎపిసోడ్స్ మరింత భారీగా ఉండే అవకాశం ఉందనే ఆసక్తి నెలకొంది.

## ‘ఇది మనందరి కథ’ అనిపించేలా..



శ్రీవిష్ణు కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది. ‘ప్రొడక్షన్ నెం 39’గా రూపొందుతున్న ఈ చిత్రానికి సన్నీ సంజయ్ దర్శకుడు. నేటి యువత జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, భావోద్వేగాలు, కలలు, ఆశలు, ఆకాంక్షలు, సవాళ్లను ప్రతిబింబించే కథతో ఈ చిత్రం రూపొందుతున్నదని, అన్ని రకాల భావోద్వేగాలతో సరికొత్త ప్రయాణాన్ని ఆవిష్కరించే ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుందని, ప్రతి ఒక్కరూ తమకు తాము చూసుకునేలా ‘ఇది మన అందరి కథ’ అనే భావన కలిగించేలా ఈ కథ ఉంటుందని మేకర్స్ తెలిపారు.సినిమాలు వీక్షించడం ఈ సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ మేకర్స్ సోమవారం గ్లింప్స్‌ని విడుదల చేశారు. యువతకు దగ్గరగా ఉండే అంశాలతో ఈ సినిమా రూపొందుతున్నట్టు గ్లింప్స్ చెబుతున్నది. సూర్యదేవర నాగవంశీ సమర్పిస్తున్న ఈ చిత్రానికి హారికా సూర్యదేవర నిర్మాత.

## ‘ఎపిక్’లో రొమాంటిక్ సీన్స్‌పై ఆనంద్ దేవరకొండ క్లారిటీ..




ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌లోనూ ఈ జంటకు మంచి క్రేజ్ ఉండటంతో సినిమాపై ఆసక్తి నెలకొంది. ‘90స్’ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. సెప్టెంబర్ 11న ఈ సినిమా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో మూవీ టీమ్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా వరుస ఇంటర్వ్యూలు, చిట్‌చాట్‌లతో సినిమాపై బజ్ పెంచుతోంది. తాజాగా ‘లిటిల్ హార్ట్స్’ దర్శకుడు సాయి మార్తాండ్‌తో జరిగిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ‘ఎపిక్’ టీమ్ పాల్గొంది. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినిమాలో రొమాంటిక్ సన్నివేశాలు చేసేటప్పుడు మొదటి నుంచీ ఏమైనా సందేహాలు ఉన్నాయా? అని సాయి మార్తాండ్ ప్రశ్నించగా.. ఆనంద్ దేవరకొండ ఆసక్తికరంగా స్పందించారు. ఆ సీన్స్ విషయంలో తనకు మొదటి నుంచీ ఎలాంటి సందేహం లేదని ఆయన స్పష్టం చేశారు. కథ విన్నప్పుడే సినిమాలోని ఆ సన్నివేశాలు కథకు చాలా ముఖ్యమైనవిగా అనిపించాయని ఆనంద్ తెలిపారు. అందుకే వాటిని చిత్రీకరించే సమయంలో కూడా ఎలాంటి అసౌకర్యం లేకుండా చాలా సహజంగా చేయగలిగామని చెప్పారు. కేవలం కమర్షియల్‌గా వర్కౌట్ అవుతుందనే ఉద్దేశంతోనో, ప్రేక్షకులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతోనో ఆ సీన్స్ పెట్టలేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. రొమాన్స్‌ను ఎలాంటి స్లీజీ పద్ధతిలో చూపించాలనే ఆలోచన తమకు లేదని అన్నారు. కథకు, పాత్రలకు అవసరమైన మేరకే వాటిని చాలా బాధ్యతగా తెరకెక్కించినట్లు వివరించారు.దహీరో, హీరోయిన్ పాత్రల మధ్య బంధాన్ని బలంగా చూపించడానికి ఈ సన్నివేశాలు ఉపయోగపడ్డాయని ఆనంద్ పేర్కొన్నారు. కథలోని పాత్రల ప్రయాణాన్ని అర్థం చేసుకోవడానికి, వారి మధ్య ప్రేమ ఎలా ఏర్పడిందో చూపించడానికి ఈ సన్నివేశాలు సహజంగానే వచ్చాయని తెలిపారు. ముఖ్యంగా ఈ సినిమాలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యంలో కొన్ని అంశాలను చూపిస్తున్నట్లు ఆనంద్ వెల్లడించారు. ఒక అబ్బాయి, అమ్మాయి పరిచయం కావడం.. ఆ తర్వాత కలిసి ఒకే చోట ఉండటం.. ఆ సమయంలో ఒకరినొకరు మరింతగా అర్థం చేసుకోవడం వంటి విషయాలను చాలా రియలిస్టిక్‌గా చూపించినట్లు చెప్పారు.

ఇద్దరూ కలిసి జీవించే క్రమంలో ఒకరి గురించి మరొకరు కొత్త విషయాలు తెలుసుకోవడం, ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారడం సహజమైన ప్రక్రియ అని ఆనంద్ వివరించారు. అందులో భాగంగానే సినిమాలో ఇంటిమసీకి కూడా ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. విడుదలకు ముందే రొమాంటిక్ అంశాలపై ఆనంద్ ఇచ్చిన క్లారిటీతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది.

## సందీప్‌రెడ్డి సార్ మెచ్చుకున్నారు



‘ఇందులో నేను సరదాగా ఉండే తమిళమ్మాయిని. బబ్లీగా కనిపిస్తా. ఇలాంటి పాత్రలో నటించాలనేది నా డ్రీమ్. ‘8 వసంతాలు’ తర్వాత చాలా కథలు విన్నాను. అవేవీ నన్ను ఆకట్టుకోలేదు. ఆ టైమ్‌లో ‘రోమాంచకం’ కథ విన్నాను. చాలా హ్యాపీగా అనిపించింది. ఎందుకంటే నేను కోరుకున్న పాత్ర ఇది’ అంటూ అనంతిక సనిల్ కుమార్ ఆనందం వెలిబుచ్చారు. అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పణలో సుమంత్‌ప్రభాస్‌కి జోడీగా ఆమె నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘రోమాంచకం’. వేణుగోపాల్‌రెడ్డి దర్శకుడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. ఈ నెల 3న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు అనంతిక. ‘యూత్‌కి బాగా రిలేట్ అయ్యే సినిమా ఇది. ఇందులో ప్రేమ మాత్రమే కాదు, వినోదం, ఉత్కంఠ కూడా ఉంటాయి. వీటిలో ఉత్కంఠ నాకు బాగా నచ్చింది. అది కూడా ప్రేమతో కూడిన ఉత్కంఠ అనమాట. యువత జీవితాల్లో జరుగుతున్న కాంటెంపరరీ ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉంటాయి. యూత్ మాత్రమే కాదు, కుటుంబ సమేతంగా ఈ సినిమా చూడొచ్చు. సుమంత్ పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. నా పాత్ర ఆయనతో పోటీపడేలా ఉంటుంది. మా మధ్య వచ్చే సన్నివేశాలు నేచురల్‌గా అనిపిస్తాయి. మ్యూజికల్ డ్రామాలంటే నాకిష్టం. ఈసినిమా కూడా మ్యూజికల్‌గా బావుంటుంది. దర్శకుడు క్లారిటీతో సినిమా తీశారు’ అని చెప్పారు అనంతిక. ఇంకా చెబుతూ ‘కొన్ని సీన్స్ నటించేటప్పుడు ఒక హ్యాపీనెస్ ఉంటుంది. అలాంటి సీన్స్ ఇందులో చాలా ఉన్నాయి. ‘8 వసంతాలు’ నాయికగా నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఈ సినిమాతో నాతోపాటు హీరోకి కూడా మంచి పేరొస్తుంది. సినిమా చూసి సందీప్‌సార్ నా నటనను మెచ్చుకున్నారు. ఇక ప్రేక్షకుల స్పందన కోసం ఎదురు చూస్తున్నా’ అంటూ చెప్పుకొచ్చారు అనంతిక సనిల్‌కుమార్.

## స్వరాలాపనలో ‘మిస్సింగ్ మేఘన’



రామ్‌కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం ‘మిస్సింగ్ మేఘన’. వాచస్పతి దర్శకుడు. పంచుమర్తి నరేష్‌బాబు నిర్మాత. ఈ సినిమా రెండో పాటను దిల్ రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ ‘ఎంతోమంది కొత్తవాళ్లను స్టార్స్‌ని చేసిన దిల్‌రాజు మా సినిమాలోని పాటను విడుదల చేయడం ఆనందం ఉన్నది. సెలబ్రిటీ వార్తలు చదవడం ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. ఇది ఓ ఎమోషనల్ థ్రిల్లర్. క్యూట్ లవ్‌స్టోరీ కూడా ఉంటుంది’ అని తెలిపారు. దిల్‌రాజు పాటలను విడుదల చేయడం పట్ల సంగీత దర్శకుడు ఆర్.ఆర్.ధృవన్, హీరో రామ్ కార్తీక్ కూడా ఆనందం వెలిబుచ్చారు. ఈచిత్రానికి మాటలు: వెంకట్ బద్దిగం, కెమెరా: శామ్ కె.నాయుడు, నిర్మాణం: ఫస్ట్‌కాపీ మూవీస్, కేడీ అండ్ కో.

## డ్రగ్స్ వ్యతిరేక సందేశంతో..



సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘ధర్మస్థల నియోజకవర్గం’. జై జ్ఞానప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 4న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ అతిథిగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తీసిన ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉందని వి.వి.వినాయక్ పేర్కొన్నారు. ఇందులో రాసిన ఐదు పాటలు ఎంతో సంతృప్తినిచ్చాయని, ‘రంగస్థలం’ తర్వాత అంత గొప్ప సాహిత్యం అందించే అవకాశం లభించిందని గీత రచయిత చంద్రబోస్ తెలిపారు. యథార్థ సంఘటనల నేపథ్యంలో ఫిక్షనల్ స్టోరీ ఇదని, చక్కటి సందేశం..వినోదంతో ఆకట్టుకుంటుందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మహావీర్ ఏలేందర్, సంభాషణలు: అస్లాం, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జై జ్ఞానప్రభ తోట.

# కేసీఆర్‌ను విమర్శించే అర్హత రేవంత్‌కు లేదు.

**- చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్.**

**- ముందు ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలి. - బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చావు నోట్లో తలపెట్టి పోరాడిన కేసీఆర్‌ను విమర్శించే అర్హత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి అన్నారు. కేసీఆర్‌ను తిట్టడం మానేసి.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని ఆయన హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్ర హోదా సాధించి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తిరుపతిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి సాగునీటి రంగానికి ఊతమిచ్చారని, రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రుణమాఫీ, దళితబంధు, బీసీబంధు వంటి సంక్షేమ పథకాలను అమలు చేశారని చెప్పారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి, సంక్షేమంలో రోల్‌మోడల్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.అభివృద్ధి చేయడం చేతకాక 'ప్రజాపాలన' పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా గత ప్రభుత్వంపై నిందలు వేయడానికే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఇకనైనా కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు.

రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు సహా వివిధ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి హోదాలో ఉండి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. తెలంగాణ కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై మాట్లాడేటప్పుడు రేవంత్‌రెడ్డి తన స్థాయిని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ప్రజలకు ఎవరు రాష్ట్రం కోసం పోరాడారో..

ఎవరు ప్రజల కోసం పనిచేశారో స్పష్టంగా తెలుసన్నారు.'నంది ఎవరో.. పంది ఎవరో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు' అని పేర్కొన్న తిరుపతిరెడ్డి.. కేసీఆర్‌ను విమర్శించడం మానేసి ప్రజల సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

## పోలీస్ క్యాంటీన్‌కు అడుగులు.

**పోలీస్ అసోసియేషన్ విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూల స్పందన**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం దిశగా మెదక్ జిల్లాలో పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఎన్నికైన మెదక్ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావును కలిసి మెదక్ జిల్లాలో పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు.క్యాంటీన్ ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యాంటీన్ ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన బాధ్యతలను సీఐ సందీప్‌రెడ్డి, ఆర్ఐ శైలేందర్‌కు అప్పగించారు.జిల్లా పోలీసు సిబ్బందికి అవసరమైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా మరింత సౌకర్యం కలగనుందని పోలీస్ అసోసియేషన్ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎస్ఐఆర్ నోటీసు, విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మాగళవారం పిల్లి కొట్టాల్లో 12 వార్డులో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ఎస్ ఐ ఆర్ నోటీసు , విచారణ ప్రక్రియ లో భాగంగా ఆధారాలు పూర్తి స్థాయిలో తీసుకొని యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.పిల్లికొట్టిల్ లో 124 నోటీసులకు 91 నోటీస్ లకు విచారణ పూర్తి చేసినట్లు వివరించారు. ఏలాంటి తప్పు ఒప్పులకు తావు లేకుండా పారదర్శకంగా ఎస్ ఐ ఆర్ నోటీసుల విచారణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగాలి :ఏబీవీపి



కూకట్‌పల్లి(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కూకట్‌పల్లి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు.కూకట్‌పల్లి బస్‌స్టాప్ నుండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు సుమారు 500 మంది విద్యార్థులు,ఏబీవీపీ కార్యకర్తలతో భారీ ర్యాలీ గా వెళ్లారు.సందర్భంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేయడంతో పాటు, విద్యార్థుల సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యేను కోరారు.విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ లా ఫోరం కో కన్వీనర్ సునీల్ సావిస్కర్, కోక్ కన్వీనర్ గోపాల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర, నగర కార్యదర్శి రఘు, కేపీ హెచ్ బి నగర కార్యదర్శి కార్తీక్, ఆకాష్ ఉదయ్ కార్యకర్తలు పాల్గొన్నారు

## కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే ఎత్తివేయడం హర్షనీయం

**మాజీ కౌన్సిలర్. బిఆర్ఎస్ సీనియర్ నేత అమరం జైపాల్ రెడ్డి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే ఎత్తివేయడం హర్షనీయమని గుండ్ల పోచంపల్లిమాజీ కౌన్సిలర్. బిఆర్ఎస్ సీనియర్ నేత అమరం జైపాల్ రెడ్డి అన్నారు.రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఎంతో ప్రతిష్టాత్మకముగా ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ స్కీం ల క్రింద పేదవారు తమ కుమార్తెల వివాహాలు చేసి వారికి గతం లో ఒక లక్ష 116 రూపాయలు కే సి ఆర్ చాలా మందికి చెల్లించారని తెలిపారు . కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టులో ఒకరు ఈ స్కీము రద్దు చేయాలని కేసు వేయగా కనీసం నెల రోజులైనా దానికి రిటర్న్ కౌంటర్ ప్రభుత్వం వెయ్యలేదని ఆరోపించారు. గతంలో కళ్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం కూడా ఇస్తామని, మహిళలకు 2500 రూపాయలు ప్రతినెల చెల్లిస్తామని, ఆరు గ్యారెంటీలో పేర్కొనడం జరిగిందని, ఈ హామీలను కూడా తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

**మేడ్చల్ బీజేపీ నాయకుడు జాకట ప్రేమ్ దాస్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మేడ్చల్ బీజేపీ నాయకుడు జాకట ప్రేమ్ దాస్ ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. అనేక ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారడం, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, తాగునీటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందకపోవడం వల్ల వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వృద్ధులు, పేదలకు పింఛన్ల విషయంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. పేదలకు ఇళ్ల మంజూరులోనూ పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. అలాగే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, ఇతర వినియోగదారులపై విద్యుత్ బిల్లుల భారం పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని జాకట ప్రేమ్ దాస్ డిమాండ్ చేశారు. వాగ్దానాలకు పరిమితం కాకుండా ప్రజలకు క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఫలాలు అందించాలని ఆయన కోరారు.

## భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ ఉమ్మడి మండల కో-కన్వీనర్‌గా చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్

**- గణేష్ ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు సమిష్టిగా కృషి చేస్తాం: రవీందర్ గౌడ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ ఉమ్మడి మండల కో-కన్వీనర్‌గా చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ నూనెముంతల రవీందర్ గౌడ్ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. మేడ్చల్ ఉమ్మడి మండలం పరిధిలోని మేడ్చల్, పూడూర్--కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి జి హెచ్ ఎం సీ డివిజన్లతో పాటు ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సమన్వయంతో పనిచేసే బాధ్యతను శ్రీనివాస్ గౌడ్‌కు అప్పగించినట్లు తెలిపారు.మేడ్చల్ గణేష్ ఉత్సవ సమితి, మేడ్చల్ నిమజ్జన సమితి ఆధ్వర్యంలో గత 8 సంవత్సరాలుగా శ్రీనివాస్ గౌడ్ అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు రవీందర్ గౌడ్ పేర్కొన్నారు.

### ఘనంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు కృషి

కో-కన్వీనర్‌గా నియమితులైన చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మేడ్చల్ ఉమ్మడి మండల పరిధిలో గణేష్ ఉత్సవాలను ఘనంగా, సమన్వయంతో నిర్వహించేందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల సహకారంతో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటామని అన్నారు.

### నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 14న జరగనున్న గణేష్ నిమజ్జనం నేపథ్యంలో మేడ్చల్ పరిధిలోని పెద్ద చెరువు, సుతారుగూడ చెరువులను వివిధ శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులు పరిశీలన చేపట్టారు.

ఈ కార్యక్రమంలో జి హెచ్ ఎం సీ మేడ్చల్ సర్కిల్ డీసీ సుధాంశు, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, సీఐ అంజిరెడ్డి, ట్రాఫిక్ సీఐ క్రాంతి, డీఈ, ఏఈ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ నూనెముంతల రవీందర్ గౌడ్, మేడ్చల్ ఉమ్మడి మండల కో-కన్వీనర్ చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, నర్సింగ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి



ధర్పల్లి (ప్రశ్న న్యూస్ )నిజామాబాద్ జిల్లా, ధర్పల్లి మండల కేంద్రంలో (డి యస్ పి) మండల అధ్యక్షుడు మహిపల్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సంపత్ వినతి పత్రం అందజేయడం జరిగింది. బీసీ ఎస్సీ ఎస్టీ జెఏ సి.జిల్లా నాయకులు రావుట్ల ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నది ఈ ఫీజులు చెల్లించలేని దుస్థితి కారణంగా ముఖ్యంగా బీసీ ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు కళాశాలలో తమ చదువులను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయి కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మొత్తంగా ఈ ప్రభావం ఒక కోటి కుటుంబాలపై పడింది ఇంతటి దుర్భర పరిస్థితిని బీసీ ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ఈ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులు ఎటువంటి ఆటంకం లేకుండా తమ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జెఏసి మండల నాయకులు వడ్ల బాలయ్య, భాస్కర్ ముదిరాజ్ , కిషన్ , సాయిలు, అక్షయ్, గోపీ , గంగాధర్, నర్సయ్యా,రాజేశ్వర్,డి యస్ పి జెఏసి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై గుండ్ల పోచంపల్లి బిఆర్ఎస్ నేతల నిరసనలు

**కార్యచరణను సిద్ధం చేసుకున్న బిఆర్ఎస్ నేతలు**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) 1000 రోజుల కాంగ్రెస్ పాలన పై నిరసనలు చెప్పేందుకు గుండ్ల పోచంపల్లి బిఆర్ఎస్ నేతలు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఆ పార్టీ సీనియర్ నేత మద్దుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ రెడ్డిల ఆధ్వర్యంలో గుండ్ల పోచంపల్లిలో నిరసన కార్యక్రమాల కార్యచరణ ను రూపొందించడానికి సమావేశాన్ని నిర్వహించారు. 6 గ్యారంటీల వైఫల్యాలపై ధర్నా, బాకీ కార్డుల పంచుట, 420 ఫీట్ల ఫ్లెక్సీ ప్రదర్శన.. నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాలను గుండ్ల పోచంపల్లి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించాలని నిర్ణయించారు. ఇదే విధంగా ఈ నెల 3 న వ్యవసాయ విధ్వంసం, 22 ఏ నిషేధిత భూముల కోసం ధర్నా చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని మునిరాబాద్ వద్ద గల ఔటర్ రింగ్ రోడ్డు చౌరస్తా వద్ద ఈ నెల 4న మహిళలకు ఇస్తామన్న 2500 పై కేసిఆర్ కిట్,కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు ఇవ్వని ప్రభుత్వానికి నిరసనగా వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని గుండ్ల పోచంపల్లి లోని హనుమాన్ గుడి వద్ద నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 5న ఫీజు రియంబర్స్మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ కోసం ధర్నా ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని మైసమ్మగూడలో నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈనెల 6న త్రాగునీరు, వీధి దీపాలు, శాంతి భద్రతలు, ట్రాఫిక్, బస్తీ దావకాన సాధనకై ఆటో ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని గౌడవెల్లిలో చేపట్టాలని తీర్మానించారు. ఈనెల 7న ప్రజావాణిలో వినతి పత్రాల సమర్పణ చేపట్టాలని, ఈ కార్యక్రమాన్ని మేడ్చల్ పాత మున్సిపాలిటీ కార్యాలయంలో చేపట్టాలని నిర్ణయించారు. ఈనెల 8న ఏడు రోజుల కార్యక్రమాలపై ప్రెస్ మీట్, అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని కండ్లకోయ పాత గ్రామపంచాయతీ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించాలని నిర్వహించారు. ఈనెల 9 ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదిన వేడుకలను భాను కన్వెన్షన్ హాల్లో నిర్వహించాలని,, ఇందులో పార్టీ శ్రేణులు, ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి, అమరన్ జైపాల్ రెడ్డి ఇతర బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీలో బిల్లుల బాగోతం

## 102 మంది కాంట్రాక్టర్లకు రూ.70 కోట్ల డబుల్ పేమెంట్లు..?

**- అవకతవకలు బయటపడగానే రికవరీకి పరుగులు - 12 మంది నుంచి రూ.7 కోట్లు వసూలు**

**- డబుల్ బిల్లులతో పాటు ఎక్సెస్ చెల్లింపులు - విజిలెన్స్ విచారణకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలు**




హైదరాబాద్(ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపుల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నుల సొమ్ముతో నగర అభివృద్ధి పనులు చేపడుతున్న జీహెచ్ఎంసీలో 102 మంది కాంట్రాక్టర్లకు దాదాపు రూ.70 కోట్ల మేర డబుల్ బిల్లులు చెల్లించినట్లు వెలుగులోకి రావడం అధికార యంత్రాంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఒకసారి చెల్లించిన బిల్లులకే మరోసారి చెల్లింపులు ఎలా జరిగాయి.? కోట్లాది రూపాయల ప్రజాధనం పర్యవేక్షణ లేకుండా ఎలా జారిపోయింది.? అన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

### డబుల్ పేమెంట్లు ఎలా జరిగాయి.?

కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించిన బిల్లుల పరిశీలన, చెల్లింపుల ప్రక్రియలో భారీ స్థాయిలో లోపాలు చోటుచేసుకున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే చెల్లించిన బిల్లులకే మరోసారి చెల్లింపులు జరగడంతో ప్రభుత్వ ఖజానాపై భారీ భారం పడింది. కేవలం డబుల్ బిల్లులతోనే వ్యవహారం ఆగలేదని, కొన్ని సందర్భాల్లో నిబంధనలకు మించి ఎక్సెస్ అమౌంట్ కూడా చెల్లించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు సమాచారం.ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరిగినా సంబంధిత విభాగాల్లో పనిచేస్తున్న అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.? బిల్లులను పరిశీలించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు.? డబుల్ పేమెంట్లను గుర్తించే ఆడిట్ వ్యవస్థ ఎందుకు విఫలమైంది.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### బయటపడగానే రికవరీ హడావుడి

అధికారుల బాధ్యతారాహిత్య వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులు నష్టపోయిన ప్రజాధనాన్ని తిరిగి రాబట్టే చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 12 మంది కాంట్రాక్టర్ల నుంచి సుమారు రూ.7 కోట్లను వసూలు చేసినట్లు సమాచారం. మిగిలిన కాంట్రాక్టర్ల నుంచి కూడా చెల్లించిన అదనపు మొత్తాన్ని తిరిగి రాబట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. డబ్బులు తిరిగి వసూలు చేస్తేనే తప్పు చేసిన అధికారులు బాధ్యత నుంచి తప్పించుకుంటారా.? కోట్లాది రూపాయల ప్రజాధనం రెండుసార్లు చెల్లించబడేంత వరకు వ్యవస్థ ఎందుకు స్పందించలేదు.? ఈ చెల్లింపులకు ఎవరి సంతకాలు ఉన్నాయి.? ఎవరు బిల్లులను పరిశీలించారు.? ఎవరి అనుమతులతో చెల్లింపులు జరిగాయి.? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### విజిలెన్స్ విచారణకు కమిషనర్ ఆదేశాలు

వ్యవహారం తీవ్రతను గుర్తించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. డబుల్ పేమెంట్లతో పాటు ఎక్సెస్ అమౌంట్ చెల్లింపులపైనా అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విచారణలో అసలు బిల్లులు, చెల్లింపు రికార్డులు, సంబంధిత ఫైళ్లు, అనుమతులు, అధికారుల బాధ్యతలను పరిశీలించే అవకాశం ఉంది.

### ఫైనాన్షియల్ అడ్వైజర్‌పై వేటు

ఈ వ్యవహారంలో బాధ్యత వహించాల్సిన అధికారులపై కమిషనర్ చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఘటనకు బాధ్యుడిగా భావిస్తూ జీహెచ్ఎంసీ ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ చంద్రను విధుల నుంచి తప్పిస్తూ కమిషనర్ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. దీంతో బిల్లుల చెల్లింపు వ్యవస్థలో బాధ్యత ఎవరిది.? అనే అంశంపై చర్చ మరింత ముదిరింది.

### రికవరీతో సరిపెట్టొద్దు, బాధ్యులపై చర్యలు ఏవీ.?

రూ.70 కోట్ల మేర డబుల్ బిల్లులు చెల్లించబడినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో కేవలం డబ్బులు రికవరీ చేయడం సరిపోదని ప్రజలు జూ అభిప్రాయపడుతున్నారు. ప్రజాధనం దుర్వినియోగానికి కారణమైన ప్రతి దశను వెలికితీసి, నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ల పాత్రను తేల్చాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీలో ఇంత భారీ మొత్తంలో డబుల్ పేమెంట్లు ఎలా జరిగాయన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. విజిలెన్స్ విచారణలో రూ.70 కోట్ల బిల్లుల బాగోతం వెనుక అసలు కథ ఏమిటి.

ఎవరెవరి పాత్ర ఉంది. ఎంత మొత్తం నిజంగా రికవరీ అవుతుంది. ఇంకా ఎక్కడెక్కడ ఇలాంటి చెల్లింపులు జరిగాయి. అన్న విషయాలు వెలుగులోకి రావాల్సి ఉంది. నగర ప్రజల పన్నుల సొమ్ముకు కాపలాగా ఉండాల్సిన వ్యవస్థలోనే అధికారుల అవినీతితో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మరి దీనిపై రేవంత్ రెడ్డి సర్కార్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# మెయిన్ రోడ్లపై ఫుడ్ ట్రక్కుల దందా

**- రాత్రయితే చాలు రోడ్లే వ్యాపార అడ్డాలు - మెయిన్ రోడ్లపై ప్రయాణం వాహనదారులకు నరకయాతన**

**- మెట్టుగూడ,ఉప్పల్ మార్గంలో ఇష్టారాజ్య పార్కింగ్ - ఒక్కో వాహనం నుంచి రూ.10 వేల వరకు వసూళ్లంటూ గుసగుసలు**

**- ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంపై వాహనదారుల ఆగ్రహం ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏదీ.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో రాత్రి వేళ రోడ్లపై ఫుడ్ ట్రక్కుల దందా జోరందుకుంటోంది. ప్రధాన రహదారులు, కూడళ్లను వ్యాపార కేంద్రాలుగా మార్చేస్తూ ఫుడ్ ట్రక్కులు ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మెట్టుగూడ నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు రాత్రి సమయాల్లో ఫుడ్ ట్రక్కుల వద్ద అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ మరింత పెరుగుతోందని, ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపైనే వాహనాలను నిలిపి ఆహార విక్రయాలు నిర్వహిస్తుండటంతో ఒకవైపు ట్రాఫిక్ నెమ్మదిస్తుండగా.. మరోవైపు ఫుడ్ ట్రక్కుల వద్దకు వచ్చే వాహనాలతో పరిస్థితి మరింత గందరగోళంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన వ్యాపారాలు సాగుతున్నా ట్రాఫిక్ పోలీసులు అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.




### రూ.10 వేల వరకు వసూళ్లంటూ గుసగుసలు

ఫుడ్ ట్రక్కులకు ప్రధాన రహదారుల వెంట వ్యాపారానికి అనుమతి ఎలా లభిస్తోంది.? వాటి పార్కింగ్‌కు ఎవరు అనుమతిస్తున్నారు.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ అనుమతులు లేకుంటే అక్రమంగా నిర్వహిస్తే ఎందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఒక్కో వాహనం నుంచి నెలకు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారనే గుసగుసలు స్థానికంగా వినిపిస్తున్నప్పటికీ ఈ ఆరోపణల పై అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై హైదరాబాద్ కమిషనర్ ఉన్నత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని వాహనాదారులు కోరుతున్నారు.




### ఉచిత టిఫిన్లా.. నెల మామూళ్లా.?

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లపై ఫుడ్ ట్రక్కులు జోరుగా నడుస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు నెల మామూలుతో పాటు ఉచిత టిఫిన్లు అందుతున్నాయా.?'

అంటూ కొందరు వాహనదారులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల నుండి ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యంపై అనేక ఆరోపణలు వస్తుండడంతో పోలీసు శాఖ దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### ఉన్నత అధికారుల ఆదేశాలు బుట్టదాఖలేనా.?

ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు సరిగ్గా కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడిషనల్ ట్రాఫిక్ సీపీ ఆదేశాలు కూడా క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై జోరుగా వ్యాపారాలు సాగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ అసలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్ల ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఫుడ్ ట్రక్కుల నిర్వహణకు అనుమతులు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ కమిషనర్ సమగ్ర తనిఖీలు చేపట్టి, ముఖ్యంగా రాత్రి సమయాలలో విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బంది అధికారులపై తప్పు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉక్రెయిన్‌లో విషాద ఘటన

## రష్యా దాడుల్లో భారతీయ పౌరుడి మృతి



కీవ్ (ప్రశ్న న్యూస్) ఉక్రెయిన్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. రష్యా చేపట్టిన భీకర దాడుల్లో ఒక భారతీయ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ధ్రువీకరించారు. గత ఐదు రోజులుగా రష్యా సాగిస్తున్న దాడుల్లో మొత్తం 12 మంది మరణించారని, వారిలో ఒకరు భారతీయుడని ఆయన వెల్లడించారు. గత ఐదు రోజులుగా రష్యా డ్రోన్లు, క్షిపణులతో దాడులను తీవ్రతరం చేసిందని జెలెన్‌స్కీ 'ఎక్స్' వేదికగా తెలిపారు. కీవ్, ఖేర్సన్, డొనెట్స్క్, జపోరిజియా సహా పలు కీలక ప్రాంతాలపై ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆయన ఆరోపించారు. తమకు గగనతల రక్షణ వ్యవస్థలు తగినన్ని లేవని, ఈ విషయంలో అంతర్జాతీయ సమాజం సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, మరణించిన భారతీయ పౌరుడి వివరాలను గానీ, అతను ఎక్కడ మరణించాడనే అంశాన్ని గానీ అధ్యక్షుడు వెల్లడించలేదు. ఈ ఘటనపై కీవ్‌లోని భారత రాయబార కార్యాలయం తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ దిశగా మృతుడి కుటుంబం, అతను పనిచేస్తున్న సంస్థ, అలాగే ఉక్రెయిన్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది.

# ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు

**- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని బండి సంజయ్ హితవు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

# రైతు ఇంటికి సీఎం విజయ్

**- బామ్మకు సర్‌ప్రైజ్ గిఫ్ట్**



సేలం (ప్రశ్న న్యూస్) తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పర్యటనలో ఒక రైతు కుటుంబానికి అనూహ్య రీతిలో ఆశ్చర్యాన్ని కలిగించారు. మంగళవారం సేలం జిల్లాలో పర్యటించిన ఆయన, ఒక గ్రామంలో ఆకస్మికంగా ఆగి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఒక వృద్ధురాలు చూపిన ఆత్మీయతకు ముగ్ధుడైన ఆయన, తాను ధరించిన కళ్లజోడును ఆమెకు బహుమతిగా అందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సేలం జిల్లాలోని మెట్టూరు డ్యామ్ గేట్లను తెరిచి, సాగునీటిని విడుదల చేసే క్రమంలో ముఖ్యమంత్రి విజయ్ అక్కడికి చేరుకున్నారు. కార్యక్రమం ముగించుకుని చెన్నైకి తిరుగుప్రయాణమైన ఆయన, మార్గమధ్యలోని చిన్నకావూరు గ్రామం వద్ద తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. నేరుగా రామస్వామి అనే రైతు నివాసానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పలకరించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షాతిరేకలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఒక వృద్ధురాలు ముఖ్యమంత్రిని చూడగానే అమితానందానికి లోనయ్యారు. ఆత్మీయంగా ఆయన్ను ఆలింగనం చేసుకుని, చేతిని గట్టిగా పట్టుకుని తన అనురాగాన్ని చాటుకున్నారు. అనంతరం తన పెరట్లోని తోటను ఆయనకు చూపించారు. ఆమె అభిమానానికి చలించిన విజయ్, తక్షణమే తాను ధరించిన కళ్లజోడును తీసి ఆమెకు బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత గ్రామంలోని వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేసి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, విజయ్ ఆ బామ్మకు బహూకరించిన సన్ గ్లాసులు వరల్డ్ క్లాస్ సంస్థ 'క్రిస్టియన్ డయోర్' తయారు చేసినవి. వీటి ధర రూ.50 వేలకు పైనే ఉంటుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588